ఎంత చీకటి !

# ఎన్ని దీపాలు !!

సహస్ర పూర్ణ చంద్ర దర్శనోత్సవ
కమిటీ ప్రచురణ

బోయి భీమన్న

ప్రథమ ముద్రణ : 1994

హక్కులు : రచయితవి

వెల : రూ. 30/-

ప్రతులకు :

**భీమన్న సాహితీ నిధి**

ఐ.సి. 85,

ఇద్రం మంజిల్ కాలనీ,

హైదరాబాద్ - 500 482.

ముద్రణ :

**పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్**

1-1-517/బి/1, న్యూ బాకారం,

గాంధీనగర్, హైదరాబాద్ - 500 038.

ఫోన్లు : 611413, 600 547

ఎంత చీకటి

# ఎన్ని దీపాలు!!

## ముందు మాట

ఆకాశం (అవకాశం) లోని చంద్రుడు, సూర్యుడు, గ్రహాలు, నక్షత్రాలు అన్నీ ఒక్కసారిగా ఆరిపోతే ఎలా వుంటుంది?

అదే పరమాత్మ, పరబ్రహ్మ.

దానిని హైందవ సమాజంలోని అంటరానితనంతో పోలిస్తే, అందులో పుట్టాను నేను. అతీ గతీ లేని అయోమయ అనాథస్థితి అది. అట్టి దుస్థితి నుంచి నేను ఇంతదూరం సాగివచ్చా నంటే, ఈ పురోగమనం ఎలా సాధ్యమయింది?

ఏదో ఒక దీపపు వెలు
గేదో ఒక మూల మిణుక కే మానవుడున్
నీ దారి తెలియనేరడు–

అంటూ నేను దీప సభ కావ్యంలో పేర్కొన్నాను. ఇలాంటి పరిస్థితినే పోతన్నగారు తన భాగవతంలో–

లోకమ్ములు లోకస్థులు
లోకేశులు తెగిన తుది నలోకంబగు పెం
జీకటి–

అంటూ వర్ణించారు. అయితే ఆయన ఆ చీకటికి అవతల ఏకాకృతితో వెలిగే భగవంతుణ్ణి గురించి చెప్పగా, నేను నా పురోగమనంలో అడుగడుగునా దారి చూపించిన అనేకానేక దీపాలను గురించి పేర్కొన్నాను. అందులో కొన్ని ముఖ్య

దీపాలను గురించి మాత్రమే ఈ గ్రంథంలో చెప్పాను. నాకు మార్గదర్శకులైన ఎందరో ఇప్పుడు లేరు. ఎందరినో మరిచి పోయాను. ఎందరికో కృతజ్ఞతలు కూడా చెప్పుకోలేకపోయాను.

ఒకొక్క దీపమూ దారిచూపి వెనక్కి పోతూవుంటే, బదులుగా మరొక క్రొత్త దీపం వచ్చి ముందుకు నడిపిస్తూ వచ్చింది. బాధించే చీకటి మాత్రమే తప్ప, దారి చూపే దీపాలు జ్ఞాపకం వుండవు. చీకటి ఒక్కటే. దీపాలు అనేకం కదా!

ఎంత పేదరికం అనుభవించినా, సాహిత్య సృష్టికి పేదరికం అడ్డురాదు. కాబట్టి, నేను సహస్రాధికంగా కవితలు వ్రాయగలిగాను. పాతికేసి కవితలు (ఖండకావ్యాలు) ఒక్కొక్క పుస్తకంగా ప్రకటించివుంటే ఇంతవరకూ నేను ప్రకటించిన సుమారు యాభై గ్రంథాలూ అయిదు వందల గ్రంథాలైనా అయి వుండేవి. నా సమకాలీనులు చాల మంది అలాగే చేసి, శతాధిక గ్రంథకర్తలనిపించుకున్నారు కూడ.

నేను నా గ్రంథాలన్నిటినీ నేనే స్వయంగా ముద్రించుకొన్నాను. ఇతర కులాల వాళ్ళ కయితే ప్రచురణ కర్తలుంటారు. అభిమానించే పత్రికలుంటాయి. ప్రచారం చేసిపెట్టే అభిమాన రచయితలుంటారు. రేడియోలలో, టీవీలలో మిత్రులుంటారు. నాకెవరున్నారని?

అయితే ప్రతిభను గుర్తించే ఉదార హృదయులుంటారు. కులాతీతంగా తోడ్పడుతూ వుంటారు. అట్టి వారినే దీపాలన్నాను.

ముట్నూరి కృష్ణారావు గారిని నేనెప్పుడూ చూడలేదు. కాశీనాథుని నాగేశ్వరరావు గారితో పరిచయం లేదు. నా విద్యార్థి దశలో కృష్ణాపత్రిక ద్వారానూ, భారతి ద్వారానూ ఆ ఇద్దరు నాకిచ్చిన ప్రోత్సాహం సూర్యచంద్రుల కాంతి వంటిది. తాపీ ధర్మారావుగారు (జనవాణి), నార్ల వెంకటేశ్వరరావుగారు (ఆంధ్రప్రభ), ఆంధ్ర శేషగిరి రావు గారు (ప్రజామిత్ర) ఈనాటికీ అఖండ దీపాలే. కళా వెంకటరావుగారు రాజకీయ జ్యోతి అయితే, బెజవాడ గోపాలరెడ్డిగారు, నిడదవోలు వెంకటరావుగారు సాహిత్య జ్యోతులు.

తెలుగులో తమ గ్రంథాలను తామే ప్రకటించుకొన్న వాళ్ళు ఎంతమంది? వాల తక్కువ మంది. ప్రకటించుకోలేక కాదు. అయితే నా గ్రంథాలను స్వయంగా ప్రకటించుకోలేని పేదవాణ్ణి నేను. అయినా తప్పనిసరిగా ప్రకటించుకోవలసి వచ్చింది! మరి గ్రంథాలన్నిటినీ ఎలా ముద్రించుకోగలిగాను? అంటరానితనానికీ, కులాహంకారాలకూ అతీతులైన అనేక మంది సవర్ణ మిత్రుల వదాన్యతతో అనన్య సామాన్యమైన అట్టి పనిని చేయగలిగాను. వారంతా దీపాలే. లెక్కలేనన్ని దీపాలు. వారందరికీ నా కృతజ్ఞతాభివందనాలు.

నాకు తరచు కలుగుతూ వుండే భావాలలో కొన్నిటిని మాత్రం ఈ గ్రంథంలో వ్యక్తం చేశాను. నా ఊహల శిఖరాలను రాసుకుపోయే విశ్వ చైతన్య తరంగాలను పట్టుకుని, వాటిని సహృదయుల ముందు వుంచాను. నా మనస్సు ఒక విశ్వభావ చర్చా వేదిక. దాని తుది నిర్ణయాలే ఈ గ్రంథంలో ప్రస్ఫుటమైనై. వేల కొలదీ భావ ఫల పుష్పాలలో ఇవి కొన్ని మాత్రమే.

నా జీవిత యాత్ర పొడుగునా నాకు లభించిన గౌరవ సన్మానాలలో నాకు జ్ఞాపకమున్న వాటిని మాత్రమే ఈ గ్రంథంలో బయోడేటాగా ఇచ్చాను. వేల కొలదీ సంఘటనలున్నై. చీకటి వెలుగులున్నై. ఎత్తు పల్లాలున్నై. కష్ట సుఖాలున్నై. ఎన్నిటిని చెప్పగలను? అందుకే వదిలేశాను.

నా గౌరవ సన్మానాలన్నీ సరస్వత్యర్పణం

నా కష్ట నష్టాలన్నీ శివార్పణం

నా జీవితంలో నన్నభిమానించిన వాళ్ళలో, తోడ్పడిన వాళ్ళలో, ప్రేరణ కలిగించిన వాళ్ళలో, దీపాలై నడిపించిన వాళ్ళలో పురుషులెంతమంది ఉన్నారో స్త్రీలూ అంతమందే వున్నారు. అయితే అట్టి సందర్భాలేవీ ఈ గ్రంథంలో పేర్కొనబడలేదు.

సత్యం, శివం, సుందరం అయిన జీవిత సన్నివేశాలు ఎక్కువగా నా ఇతర రచనలలో కనిపిస్తై. నే నెక్కువగా శృంగార రసాన్ని ఆశ్రయించినవాణ్ణి. సమకాలీన, సాంఘిక సమస్యలను కవితా వస్తువులుగా స్వీకరించినా, కవిత్వాన్ని మాత్రం కాంతా సమ్మితంగానే చెప్పాను. రసధ్వనినే చేబట్టాను. కులతత్వ ప్రభావంవల్ల

భారతీయ మనీష ఇంతవరకూ నన్ను ఉపేక్షిస్తూ వచ్చినా, ఇకముందు నన్నుకాదని తప్పుకుపోవడం సాధ్యం కాదనే నేననుకొంటున్నాను. నా సరస్వతి అంత బలమైంది. నా నిజాయితీ అంత స్థిరమైంది.

నేను నా సాహిత్యం ద్వారా సామాజిక స్పృహకు చేస్తూ వస్తున్న సేవ అపారమైనట్టిది. అది బహుముఖం. ప్రధానంగా ఒకటి సవర్ణ హిందువులలో మన గత వైభవ వాస్తవాలను స్మరింపజేయడం. రెండు హరిజనులలో మన వారసత్వ హక్కులను స్ఫురింపచేయడం. అందుకు తగిన రచనా విధానాన్నే అనుసరించాను.

నా రచనలలో చాల భాగం అర్థం కావడం లేదని కొందరు హరిజన విద్యావంతులు బాధపడుతున్నట్టు వినికిడి. కాలం గడిచే కొలదీ అదే అర్థమవుతుంది. విరుద్ధాభిప్రాయాలతో, పక్షపాత దృష్టితో మాత్రం చదవకూడదు. జిజ్ఞాసతో, నిజమేదో తెలుసుకోవాలన్న ఆసక్తితో చదవాలి.

నాకు సన్మానాలు జరుగుతున్నాయంటే, నన్ను ఎంతో మంది గురుభావంతో గౌరవిస్తున్నారంటే – అట్టి వారిలో అధిక సంఖ్యాకులు సవర్ణ హిందువులే. సాంస్కృతిక రంగంలో హరిజన యువకులకు ఆసక్తిని కలిగించి, ఇతర కులాల విద్యావంతులతో సమానమైన స్థాయిని వారిలో కలిగించడానికే నిజానికి నేనెక్కువగా ఈ సన్మాన గౌరవాలకు అంగీకరిస్తున్నాను.

ఈ దేశంలో మెజారిటీ జాతి హరిజనులే. జాతి యొక్క వైదిక, పౌరాణిక, తాత్విక, సాంస్కృతిక నాయకత్వమంతా హరిజనులదే (వ్యాస వాల్మీకుల ద్వారా) అన్న గాఢ విశ్వాసం నాది. అక్షర సిద్ధాంతం నాది. ఈ నా సిద్ధాంతాన్ని కాదన్న వారెవరూ సవర్ణ హిందూ పండితులలో లేరు. అందుకే నా ఉద్బోధ ఇంత గాఢంగా, దృఢంగా వుంటున్నది.

ఈ సహస్ర చంద్ర దర్శనోత్సవానికి కూడా నేను అంగీకరించింది అందుకే. నా కులం వాళ్ళైన హరిజనులలో, సమైక్య జాతి ప్రవక్త అయిన డా. అంబేడ్కర్ గారి పుణ్యమా అని, ఇప్పుడు విద్యావంతులూ, ఉన్నతాధికారులూ, రాజకీయ ప్రముఖులూ, వ్యాపార వేత్తలూ కూడ పైకి కనిపిస్తున్నారు. అందుకు తగిన

స్థాయిలో సాంస్కృతిక వికాసం ఎందుకు కలగడం లేదు? ఇదీనన్ను బాధిస్తున్న ప్రశ్న.

జాతి వికాసానికీ, అభ్యున్నతికీ ధనమూ, అధికారమూ మాత్రమే చాలవు. తగిన సంస్కృతీ సంస్కారాలుండాలి. అట్టి పరమజ్ఞతను (Higher Awareness) కలిగించాలనేదే ఈ ఉత్సవాన్ని నిర్వహించడంలో నిర్వాహకుల ఉద్దేశమూ, నా లక్ష్యమూను.

ఈ ఉద్దేశాన్ని వెలిబుచ్చి కార్యాచరణకు పూనుకొన్న డా. జస్టిస్ పున్నయ్యగారు ఇప్పుడున్న హరిజన మేధావులలో ఉన్నతోన్నతుడు. ఉత్తమోత్తముడు. కొందరు కొందరు ఇంకా స్వార్థ సంకుచిత మనస్తత్వంలో పడి వున్నప్పటికీ, పున్నయ్యగారి సాంస్కృతిక మార్గ దర్శకత్వాన్ని మొత్తం మీద హరిజన మేధావులందరూ గుర్తించారనే అనుకోవచ్చు. అందుకు తగు నిదర్శనలు ఈ ఉత్సవ సందర్భంలో కనిపిస్తున్నాయి. అట్టి వారందరికీ నా శుభాభికాంక్షలు. డా. జస్టిస్ పున్నయ్యగారికి నా కృతజ్ఞతాభివందనాలు.

నిజానికి ఈ వెయ్యి పూర్ణిమల పండగనాటికి ఒక పుస్తకం ప్రకటించాలనే ఆలోచన నాకు చాల ఆలస్యంగా కలిగింది. కొంచెం ముందు కలిగివుంటే ఇంకొంచెం సమగ్రంగా వ్రాసివుండేవాణ్ని. తొందర తొందరగా వ్రాయడంవల్ల ఇది ఒక క్రమంలో కాక ఒక భావ స్రవంతి (Stream of Conscience)గా తయారయింది. సహృదయులు గుర్తించగలరు.

ఈ దేశంలో మైనారిటీలంటే మత మైనారిటీలే. జాతి మైనారిటీలు కాదు. పైగా అన్ని మత మైనారిటీలు మైనారిటీలుగా పేర్కొనబడడం లేదు. క్రైస్తవులు ముస్లింలు మాత్రమే అలా పేర్కొనబడుతున్నారు. అంబేడ్కరుగారు స్పష్టంగానే ఈ విషయం చెప్పారు. ఈ రెండూ విదేశీ మతాలు కనుక వీటిని తాను స్వీకరించడం లేదన్నారు. ఆయన ఉద్దేశం నిజమే అయినా, ఈ రెండు మతాలూ విదేశీ మతాలే అయినా, వాటిని అనుసరించి, ఈ దేశం పౌరులుగా స్థిర నివాసాలేర్పరచుకొని వున్న క్రైస్తవులూ, ముస్లింలూ భారత పౌరులే గదా! మౌలికంగా ఈ దేశ ప్రజలే కదా? వైష్ణవులను, శైవులను, జైనులను మనం మైనారిటీ లనడం లేదు కదా!

ఇలా అనిపిస్తుంది నాకు – క్రైస్తవులను, ముస్లింలను చూసినప్పుడు. మతాలు వేరైనా వీళ్ళంతా నా వాళ్ళే అనిపిస్తుంది. నా బంధువులే అనిపిస్తుంది. ఎంతకాలం వీళ్ళు ఈ నా దేశంలో మైనారిటీలుగా వుంటారు అనిపిస్తుంది.

క్రైస్తవుల విషయంలో బాధలేదు. ఒక్క మత విశ్వాసంలో తప్ప తక్కిన వేష భాషాది సమస్త విషయాలలోను తమ సహ భారతీయులకంటే భిన్నంగా లేరు. వాళ్ళ విషయంలో సాంఘిక సమస్యలేవీ లేవు. ఒక్క ముస్లింల విషయంలోనే సాంఘికంగా సెగ్రిగేషన్ వుంది. వేష, భాష, ఆచారాదులలో విజాతీయతా, విదేశీయతా వుంది. అందుకే ఇన్ని సమస్యలు.

ఈ సమస్యలు తీరాలంటే మెజారిటీ జాతికి వీలయినంత దగ్గరగా రావడానికి వాళ్ళు కూడా ప్రయత్నం చెయ్యాలి. ఈశ్వర్ అల్లా తేరేనాం అంటూ హిందువులు సర్దుకుపోతూనే వున్నారు కదా!

"My alliance with the Musalmans Presupposes their perfect tolerance for my idols and my temples" అన్నాడు గాంధీజీ, 1924లో "Young India" పత్రికలో వ్రాస్తూ. అదే లక్ష్యం కోసం చివరవరకు కృషిచేశాడు. ఆయన కృషి ఫలించకపోవడానికి కారణం దేశకాల పరిస్థితుల కనుగుణంగా మైనారిటీలు మారలేకపోవడంవల్లే కదా?

అన్ని వర్గాలూ చైతన్యవంతులై తమ తమ అస్థిత్వాల కోసం నడుం కట్టి పోరాడే పరిస్థితి ఏర్పడివున్న ఈ ఆధునిక కాలంలో తాతల నాటి మిణుగురులనే నమ్ముకొని బ్రతకడం క్షేమమేనా అనేది నా ప్రశ్న. ఆలోచించవలసిందిగా యువతరానికి నా విజ్ఞప్తి.

అందుకే క్రైస్తవులకు, ముస్లింలకు, దళితులమని చెప్పుకొంటున్న వారికి నేను నమస్సులతో విజ్ఞప్తి చేశాను. ఈ దేశపు సంపూర్ణ పౌరులుగా వికసించండని, పురోగమించండని.

* * *

# ఎంత చీకటి :
# ఎన్ని దీపాలు !!

ఎంత చీకటి ! ఎన్ని దీపాలు !
ఎంత శూన్యం ! ఎన్ని సౌందర్యాలు !
ఎన్ని అమావాస్యల త్యాగ లవాలపై
ఇన్ని పూర్ణిమ లిలా వికసిస్తున్నాయో !

బహు విధాల వృక్ష లతా గుల్మాదులతో, తోటలతో, పక్షులతో, జంతువులతో, చెరువులతో, నీటి బావులతో, కాలువలతో నైమిశారణ్యం లోని ఒక భాగమా అన్నట్టుండే మామిడికుదురు గ్రామంలో పుట్టాను నేను. ఆ గ్రామం భూలోక నందనం అని పేరుపొందిన కోనసీమలోది. వైనతేయ నదీతీరంలోది. కెరటాల హోరు వినిపించేటంత సముద్ర సమీపం లోది.

నేను పుట్టేనాటికి భారత, భాగవత, భక్త విజయ గ్రంథాల రూపంలో సరస్వతి ఎలా మాయింట గంతులు వేస్తున్నదో, అలానే నందన బృందావనాల సౌందర్యమంతా రాశీభూతమైన ప్రకృతి నా చుట్టూ హావభావా లొలికిస్తూ, శుక పిక శారికా బృంద గానాలతో అలరిస్తూ వున్నది. మా అయ్య వేదాంత గోష్ఠుల మధ్య, మా అమ్మ జానపద కథా గానాలాపాల మధ్య పెరిగాను నేను.

మాది ఊరిబయట తోటలలో బ్రతుకుతున్న ఒక పేద హరిజన కార్మిక కర్షక కుటుంబమే అయినా, ఆ ఊరి కంతటికీ మా అయ్యదే పెద్ద మాలతనం. ఆ చుట్టు పక్కల కుల మత ప్రమేయం లేకుండా ఎవరికీ ఏ తగవులు ఏర్పడినా, తుది తీర్పు చేప్పేవాడు మా అయ్యే. ఆ ప్రాంతంలోని ముముక్షువు లకు అద్వైత మార్గం ఉపదేశించే గురువు మా అయ్యే. అందువల్ల నేను చిన్నప్పటి నుంచీ మంచివాడుగానే పెరిగాను. మంచివాడుగానే అందరిచేతా ప్రేమించబడ్డాను. ఒక్క మాల మాదిగలే కాదు, మా గ్రామంలోని కాపులు, శెట్టి బలిజీలు, ముస్లింలు కూడా నన్ను సౌమనస్యంతోనే చూశేవారు.

మా అయ్య సాన్నిధ్యం నన్ను అద్వైత వేదాంతిగా తీర్చిదిద్దవలసింది. అయితే ప్రకృతి సౌందర్యం నన్ను కవిగా శిల్పీకరించింది.

మృత్పిండ మే కో బహు భాండ రూపా
సువర్ణ మే కో బహు భూషణాని
గోక్షీర మే కో బహు ధేను రూపా
ఏకో పరాత్మా బహు జీవ రూపం.

అయిదారేళ్ల పిల్లవాడిగా, నా కింకా అ ఆ అయినా రాకముందే మా అయ్య పాడుకొంటుండగా నాకు కంఠస్థమయిన శ్లోకమిది. అందుకే నేను అద్వైత వేదాంతంలో పుట్టా ననడం.

"మందార మకరంద " వంటి భాగవత పద్యాలూ, "బయ లాకాశం బంచును భయపెట్టుదు రందువలన భయపడకు సుమా" వంటి శుద్ధ నిర్గుణ తత్వ కందార్థ దరువులూ, ఎన్నో నాకు ఆ చిన్న వయస్సులోనే పట్టుబడినై. ఇదంతా నాలో సహేతుక, తాత్విక విజ్ఞానాన్ని పెంచింది. అయితే, నా చుట్టూ గల జీవిత రస భావ సౌందర్యాలు మాత్రం నన్ను కవిగానే పెంచాయి. అద్వైతం రసాద్వైతం అయ్యింది. వేదాంతం వైశాఖీ చరణ సేవక చక్రవర్తిని చేసింది.

## 2

నేను పుట్టిన నాటి నుంచీ నా జీవితం ఎలా క్రమ వికాసం చెందిందో వివరించాలని ముందనుకొన్నాను. అయితే, అది కేవలం ఆత్మకథ (Auto - Biography) వ్రాయడమే అవుతుంది కనుక ఉద్దేశం మార్చుకొన్నాను.

ఆత్మకథలు అందరికీ వుంటై. మానవులకే కాదు. సృష్టిలోని ప్రతి లవానికీ ఒక కథ వుంటుంది. వ్రాయగల ప్రతి వ్యక్తీ తన ఆత్మకథను వ్రాయవచ్చు. చెప్పగల ప్రతి వ్యక్తీ తన జీవిత చరిత్రను చెప్పవచ్చు. కథలేని జీవితమే ఉండదు. అందువల్ల ఆత్మకథ చెప్పుకోవడంలో ప్రత్యేకత ఏమీ లేదనిపించింది.

కుల మతాలూ, కలిమి లేములూ, సేవకత్వ యాజమాన్యాలూ, నిమ్నోన్నత పరిధులూ, జాతి వర్ణ భేదాలూ వంటి లక్షణాలలో తర తమ భేదాలు ఎన్ని వున్నప్పటికీ మొత్తం మీద ప్రతి మనిషి జీవితమూ ఒకే రకంగా ఒకే లక్ష్యం వైపు నడుస్తుంది. ఏ జీవి అయినా ఏ అజ్ఞాత మహస్సు నుంచి ఉదయించి, వివిధ కార్యకలాపాలుగా వికసించి విన్యసించిందో తిరిగి అదే అజ్ఞాత మహస్సులో విలీనమైపోతుంది. అదే దాని లక్ష్యం. జన్మస్థానం ఏదైనా కావచ్చు. యాత్రాపథం ఏ దిక్కుగానైనా సాగవచ్చు. అందుకే నా ఆత్మ కథను చెప్పుకోవాలన్న ఉద్దేశం మార్చుకొనడం జరిగింది.

అయితే, అందరి విషయంలోవలెనే నా విషయంలో కూడా వ్యక్తిత్వం గురించి తెలియాలంటే నేను ఏ మార్గంలో, ఏ ఏ కష్టనష్టాలను ఎదుర్కొంటూ ఏ స్థాయిలో పయనించానో, ఏ యే ఆశ్రమాలలో విశ్రమించానో, ఎంతదూరం రాగలిగానో లోకానికి తెలియవలసివుంది. అందుకే నా జీవిత యాత్రలోని ఆయా మజిలీలను గురించి, ఆయా ఘట్టాలను గురించి, ఆయా గౌరవ సన్మానాలను గురించి ఈ రచన చివర్లో బయోడేటా (Bio - Data) గా ఇచ్చాను. అదే క్లుప్తంగా నా జీవిత చరిత్ర.

ఇప్పుడు నేను చేయదలచింది ఏమిటంటే – ఈ నా ఎనభయి మూడేళ్ళ

జీవితంలోనూ నేను ఏమి చేశానో, ఏమి చెయ్యలేదో, నా ఆలోచనలూ, ఆకాంక్షలూ ఎలా వుండేవో సింహావలోకనం చేసుకోవడం.

ఇక్కడ ముందే ఒక విషయం చెప్పుకోవాలి – నేనేం చేసినా నా సుఖ సంతోషాల కోసమే చేశాను. నేనే పనైనా చెయ్యలేదంటే అది నా కిష్టంలేదు కాబట్టే చెయ్యలేదు.

మరొక వాస్తవం కూడా చెప్పాలి. నేను ప్రధానంగా కవిని. కవిత్వం నా ప్రవృత్తి. అయితే, నా ప్రతి రచన వెనుకా ఒక ప్రేరణ శక్తి వున్నది. అది బహుముఖాలుగా వికసించి నన్ను అలరించిన రసభావ సౌందర్యాల పరమానురాగంగా పరిమళించింది, ఫలించింది.

## 3

నా చిన్నప్పటినుంచీ నా కొక అలవాటు వుంది. నన్ను నేను విమర్శించుకోవడం, పూర్వ, సమకాలీన కవుల జీవితాలతో నా జీవితాన్ని పోల్చి చూసుకుంటూ వుండేవాణ్ణి. అది కొంత మేలూ చేసింది, కొంత కీడూ చేసింది. ప్రకృతి పరిశీలన సౌందర్యాస్వాదన, ప్రకృతి పురుష తత్త్వావగాహన వంటివి నాకు అలవడ్డాయి. నేను ఏది వ్రాసినా అందులో ఒక స్థిరమైన తాత్విక దృష్టి వుంటుంది. పచ్చి శృంగారం పరుపుమీద కూడ ప్రకృతి పురుషులుంటారు.

అయితే, అంతటి మహాకావ్యాన్ని వ్రాసిన వాల్మీకి ఏమి చదువు కున్నాడు ? వేద ఋషులకు చదువు వచ్చునా ? అప్పటికి లిపి కూడా లేదు కదా ? వంటి ప్రశ్నలు వేసుకుని నేను ప్రతిభకు ఇచ్చిన ప్రాధాన్యం వ్యుత్పన్నతకు ఇవ్వలేదు. దానివల్ల ఎంతో నష్టపోయాను. ఆ నష్టాన్ని పూడ్చుకోవడం కాలం గడిచే కొలదీ కష్ట సాధ్యమే అయింది.

ఇందులో నన్ను కాపాడిన అదృష్టం ఏమిటంటే నా స్వభావం. నా స్వభావమే నా సరస్వతి.

నేను ఇతరుల గ్రంథాలను చదవకూడ దనుకోవడంలో నా ఉద్దేశం నా మౌలిక చింతనకు, నా స్వతంత్ర పరిశీలనకు అది అవరోధం అవుతుందని. అది నిజమే కావచ్చు కాని దాని వల్ల నా వక్తృత్వ కళ దెబ్బతినింది. వక్తగా రాణించాలంటే ప్రసంగంలో మధ్య మధ్య ప్రాచీన, సమకాలీన మహారచయితల నుంచి ఉదాహరణలిస్తూ వుండాలి. నేను ఎక్కువగా చదవకపోవడం వల్ల వక్తగా రాణించలేకపోయాను. (ప్రవక్తగా రాణిస్తున్నానంటారు కొందరు).

## 4

నాకు ఏడవ ఫారం నుంచీ (ఇప్పుడు అదే ఆరవక్లాసు) గవర్నమెంటు స్కాలర్‌షిప్పు వుండేది. దానిని మా అయ్య ముట్టుకునేవాడు కాదు.

"కన్నబిడ్డలను పెంచి పెద్దవాళ్లను చేసే బాధ్యత తల్లిదండ్రులది. బిడ్డల సంపాదనపై ఎట్టి అధికారమూ తల్లిదండ్రులికి లేదు. ఇది నా సిద్ధాంతం. అందువల్ల నీ స్కాలర్‌షిప్పు డబ్బులు నువ్వే ఖర్చు పెట్టుకో. మిగిలింది దాచుకో" అన్నాడు మా అయ్య. నేను ఆ నాటి నుంచి ఖర్చుపెట్టుకోవడమే తప్ప, మిగిల్చి దాచుకోవడమనేది జరగలేదు.

ఆ విధంగా నాకు ఆర్థిక స్వాతంత్ర్యం చిన్నప్పుడే లభించడంతో నా స్వభావం నా చేత కనిపించిన పుస్తకాన్నెల్లా కొనిపించింది. నేను రెండవ ఫారంలో వుండగానే మా నగరం సంతలో 'అమరకోశం', 'మనుచరిత్ర' (టీకా తాత్పర్య సహితం) కొన్నాను. కంఠస్థం చేయడానికి పూనుకున్నాను. అప్పటికి కవిత్రయం వారి మహాభారతం 18 పర్వాలూ, పోతన్నగారి భాగవతమూ, మహా భక్తవిజయమూ రెండేసిసార్లు చదివివున్నాను. (అర్థమైనా, కాకపోయినా). అమరకోశం కొన్న తరువాత ఈ చదవడం కొంత సులభమైంది.

# 5

మూడవ ఫారం పరీక్షలు అయిపోయి వేసవి సెలవలు మొదలైనరోజు శుక్రవారం. మా స్కూలు ఎదరే సంత. సాయంకాలం స్కూలు మూసివేయ గానే హాయిగా సంతలో ప్రవేశించినపుడు, ఆజానుబాహుడైన ఒక కొత్త వ్యక్తి వెనకనుంచి నా భుజం మీద చెయ్యి వేశాడు నేను ఉలిక్కిపడి వెనక్కితిరిగాను. వెనక్కి తిరిగి ఆశ్చర్యపోబోతుండగా "మీరే కదా బోయి భీమన్న అంటే?" అన్నాడు. "మీరు పద్యాలు వ్రాస్తారట కదా ?" అన్నాడు. "మీకు ఛందస్సు తెలుసునా ?" అన్నాడు, అప్పుడు నోరు విప్పాను నేను "తెలియదు" అని.

ఆయన పేరు గుబ్బల వీరాస్వామి గారు. అంతకు కొన్ని సంవత్సరాల ముందు అదే స్కూల్లో మూడవ ఫారం పాసై వెళ్ళినవాడు. పద్యాలు బాగా వ్రాస్తాడు. కులం శెట్టిబలిజ.

"మీ గురించి నా కెవరో చెప్పారు. ఈ సెలవల్లో ఈ పుస్తకం బాగా చదవండి. ఈ దేశంలో మన కెవరూ ఏమి చెప్పరు – మనకు మనమే చదువు కోవాలి. మీరు ఆ పని చేస్తున్నట్లు కూడా తెలిసింది" అంటూ రెండు పుస్తకాలు ఇచ్చాడాయన. అందులో ఒకటి తాను వ్రాసిన "శ్రీపతీ శతకం". రెండోది వేములవాడ భీమకవి వ్రాసిన "కవిజనాశ్రయం"

కవిజనాశ్రయం ఒక సుప్రసిద్ధమైన లక్షణ గ్రంథం. నా ఆనందానికి అవధులు లేవు. అయితే, దానిని ఒకసారి చదివిన తరువాత ఎంతో నిస్పృహ ఆవరించింది నన్ను. హ్రస్వాక్షరాలు, దీర్ఘాక్షరాలు, వాటితో గణాలు, యతులు, ప్రాసలు. ఒక పద్ధతి ప్రకారం మాటల్ని ఒకదాని తర్వాత ఒకటి పేర్చుకుంటూ అర్థం కుదిరేటట్టు పద్యం వ్రాయడం ఎవరికైనా సాధ్యమేనా? సాధ్యంకాదు. అనే నిర్ణయానికి వచ్చి కాసేపు ఏడ్చుకుని, కొన్ని రోజులపాటు తోటల్లో పిచ్చి పిచ్చిగా తిరిగాను.

అయితే అప్పటికే ఒక వంద పద్యాలు పైగా వ్రాసి ఉన్నాను. అందులో ఎక్కువ భాగం వృత్తాలే. భారత, భాగవతాలలోని పద్యాలు చదివిన ధోరణిలో, అదే నడకలో వ్రాసే వాణ్ణి. పాదానికి 19, 20 లేక 21 అక్షరాలుండాలి. నాలుగు పాదాలకూ రెండో అక్షరం ఏదో ఒకే గుణింతానికి చెంది వుండాలి. అప్పటికి నాకు తెలిసింది అంతే. గణాలు తెలియవు. కంద పద్య లక్షణం మరీ మతి పోగొట్టింది.

అలా కొన్ని రోజులు విషాద సముద్రాన్ని ఈదిన తరువాత, హఠాత్తుగా ఒడ్డు తగిలినట్టు ఒక ఆలోచన వచ్చి, అంతవరకూ నేను వ్రాసిన పద్యాలను ఈ లక్షణ గ్రంథంలోని ఛందోరీతులతో పోల్చి చూసుకున్నాను. ఎక్కడో రెండు మూడు చోట్ల తప్ప పద్యాలన్నీ కరెక్టుగానే కనిపించాయి. మళ్లీ నాలో ఆనందం ఉప్పొంగింది. పద్యాలు వ్రాయడంలోని కిటుకు తెలిసింది. ఏ ఛందస్సు లోని పద్యాన్ని అయినా వ్రాయడానికి దాని లక్షణం తెలియక్కర లేదు. దాని నడక తెలిస్తే చాలు. ఆ నడకలో మనం అనుకొన్న భావాన్ని చెప్పగలిగితే చాలు !

కంద పద్య లక్షణం నాకు నాడు నేడు కూడా గుర్తులేదు. కాని, కందం వ్రాయడమే అన్నిటికంటే ఎక్కువ సులభం. అందుకు కారణం నడక తెలియడం. నడకకు తగిన మాటను వాడ వలసి ఉంటుంది కనుక, మాటలకుండే పర్యాయ పదాలు ఎక్కువగా తెలియాలి. అంటే భాషాజ్ఞానం బాగా ఉండాలి. అందుకు పూర్వ గ్రంథాలు చదవాలి. తెలుగు నిఘంటువులు ఒకటి, రెండు దగ్గరుంచుకోవాలి. ఆ విధంగానే నేను చిన్నప్పుడే టీకా తాత్పర్యాలతో కూడిన కావ్యాలూ, భగవద్గీత చదివాను. వాటిలోని అందమైన మాటలను గుర్తుపెట్టు కున్నాను. చక్కని పద్యాలనూ, శ్లోకాలనూ కంఠస్థం చేశాను.

తెలుగు కావ్యాలనూ, సంస్కృత గ్రంథాలనూ టీకా తాత్పర్యాలతో ప్రకటించిన వావిళ్ళ వారికి నేనెంతగానో కృతజ్ఞుణ్ణి. సంస్కృత వాఙ్మయాన్ని మోక్షమూలర్ మహాశయుడు ఇంగ్లీషులోకి అనువదించడం వల్ల భారతీయ సాహిత్యం గురించీ,

తత్వదృష్టిని గురించీ తెలిసింది. అలాగే తెలుగు కావ్య ప్రబంధాలకూ, సంస్కృత రచనలకూ తెలుగులో వావిళ్ళ వారు అర్థాలు చెప్పడంవల్ల నా లాంటి వాళ్ళకు భాషా జ్ఞానం అలవడింది. అట్టి ఉత్తేజకరమైన మనోవైఖరితో నేను రాజోలు హైస్కూలులో నాల్గవ ఫారంలో చేరాను.

నేను ఇలా చెప్పుకుంటూ పోతే కొన్ని వేల పేజీలు అవుతై. "పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న " అనే పేరుతో మా ఆవిడ హైమవతి వ్రాసిన గ్రంథంలో కొన్ని వివరాలున్నై. అందువల్ల మరికొన్ని విశేషాలను మాత్రమే ఇక్కడ చెబుతాను. కొన్ని ఆలోచనలను వివరిస్తాను.

## 6

మామిడి కుదురూ, నగరమూ జంట గ్రామాలు. సఖినేటిపల్లి వద్ద వశిష్టాతీరం నుంచి, పాశర్లపూడి వద్ద వైనతేయతీరం వరకూ వెళ్ళే రోడ్డుకు ఇరుప్రక్కలా వున్న జంట గ్రామాలివి. అప్పుడు నగరం ప్రధానంగా ఉండేది. ఇప్పుడు మామిడికుదురు మండల కేంద్రంగా వుంది.

నేను నగరం మిడిల్ స్కూల్లో రెండవ ఫారం చదువుతున్నప్పటినుంచే స్కాలర్‌షిప్ వచ్చిందని చెప్పాను కదా ! అది కాలేజీలో బి. ఎ. చివరి వరకూ కొనసాగింది.

కాలేజీ క్లాసుల్లో నెలకు పాతికరూపాయ లిచ్చేవారు. ఎంత దర్జాగా ఖర్చుపెట్టుకున్నా భోజనానికి, అద్దెలకూ, పుస్తకాలకూ ఇతర అన్ని ఖర్చులకూ కలిపి 8 రూ॥లకు మించేదికాదు. ఇంకా 15 రూ॥ లకు మించే మిగిలేది. ఆ డబ్బులు దాచుకుని నాతోటి విద్యార్థులు కొందరు రెండేసి, మూడేసి ఎకరాలు భూమి కొనుక్కున్నారు. ఆ సంగతి తెలిసిన మా అయ్య " నీ డబ్బేం చేశావు?" అని నన్నడిగినప్పుడు నేను ఎంతమంది పేద విద్యార్థులకు సహాయం చేశానో గొప్పగా చెప్పుకున్నాను.

అప్పుడాయనకి చాలా కోపం వచ్చింది. ఆర్థికస్థితి దిగజారిపోయి, కౌలుకు

చేస్తున్న పొలాలన్నీ వదిలేసుకుని, పస్తులు కూడ వుండవలసి వస్తున్న దుస్థితి మా దప్పుడు. బాధ్యతలు తెలియని చిన్నవయస్సు నాటి నుంచే ఆర్థిక స్వేచ్ఛను కలిగించిన తన పుత్ర ప్రేమకు తనను తానే నిందించుకుని విచారించాడాయన. ఆయన ఆదర్శమూ మంచిదే. నా ప్రవర్తనా ఆదర్శప్రాయమైనట్టిదే. ఆయన విచారించడమూ సహజమే. నేను పశ్చాత్తాప పడక పోవడమూ సమంజసమే. అలా అనుకుని తృప్తిపడ్డాను.

## 7

నేను ఎన్నడూ, ఎందుకూ పశ్చాత్తాప పడలేదు. పశ్చాత్తాపం అనే మాటే నాకు కిట్టదు. ఏదైనా ఒక పని చేసినప్పుడు, అప్పటికి తప్పనిసరి అయ్యి ఆ పనిచేస్తాం. ఆ పని మంచిదా చెడ్డదా అనే ఆలోచన ఆ తరువాత వస్తుంది. అది తప్పని తేలినప్పుడు పశ్చాత్తాప పడడం జరుగుతుంది. మరి పశ్చాత్తాపపడవలసిన పని ఎందుకు చేసినట్లు ? ఎందుకంటే, ఆ క్షణంలో ఆ పని చెయ్యక తప్పకపోవడం వల్ల. మరి ఆ పని చెయ్యక తప్పనప్పుడు, తర్వాత పశ్చాత్తాప పడడం దేనికి ?

"పశ్చాత్తాపపడవలసిన పని చెయ్యకు, చేసిన పనికి పశ్చాత్తాపపడకు". ఇదీ నా సిద్ధాంతం. పశ్చాత్తాప పడేవాళ్ళంతా మోసగాళ్ళని నా ఉద్దేశం. పాపం చెయ్యకూడదనడం, చెయ్యకూడదని బోధిస్తూనే అదే పాపం చెయ్యడం, గొప్పగా పశ్చాత్తాప పడడం, మళ్ళీ అదే పాపం చెయ్యడం. ఇది నీతి బోధకులు చేస్తున్నపని, వీళ్ళందరూ హిపోక్రాట్లే నా దృష్టిలో.

## 8

"దేవుడు లేడు, పరమాత్మ వుంది" అనేది నా మరొక సిద్ధాంతం. "మోక్షం నా జన్మహక్కు", "డ్రగ్ ఎడిక్టులు" కావ్యాలలో ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, హేతుబద్ధంగా వివరించి వున్నాను. అయితే, చాలామంది మిత్రులు, విద్యావంతులు చేస్తున్న పనేమిటంటే "దేవుడు లేడు" అన్నంత వరకే చదివి, ఆ తరువాత చూడకుండా

నన్ను నాస్తికుడుగా ప్రచారం చేస్తున్నారు. నేనిక్కడ స్పష్టంగా చెప్పదలిచాను. "నేను నాస్తికుణ్ణి కాను" అని.

నేను నాస్తికుణ్ణికాదు. నేను బ్రహ్మావాదిని, బ్రహ్మ, పరబ్రహ్మ, పరమాత్మ, పరాశక్తి, Almighty వంటి పేర్లు విశ్వచైతన్య శక్తిని సూచించేవి. అది విశ్వాసాన్ని నడిపించే జీవశక్తి. నిత్య నిరంతర చైతన్య తరంగిణి.

నేను లేడంటున్న దేవుడు మతాలు చెప్పే గాడ్డు (God) .

ఏ మతానికి ఆ మతమే తనకు ప్రత్యేకంగా ఒక దేవుడు వున్నాడంటుంది. తన ప్రవక్తే ఏకైక ప్రవక్త, తన మత గ్రంథమే ఏకైక మత గ్రంథం, తన దేవుడే ఏకైక దేవుడు అంటుంది. అయినప్పుడు రెండు విరుద్ధ ఆచార సంప్రదాయాలలు గల మతాలకు ఒకే దేవుడుండడం సాధ్యం కాదు కదా ? అలాగే ఇద్దరు లేక చాల మంది దేవుళ్ళుండడం కూడ సంభవం కాదు కదా ? అందుకే నేను బ్రహ్మావాదిగా, పరమాత్మ వాదిగా దేవుడు లేడు అన్నాను. ఇది ప్రకృతి విజ్ఞాన పరంగా కూడా సహేతుకమైన ప్రవచనమే.

## 9

నేను చిన్నప్పుడు భగవద్గీత చదివినప్పటినుంచీ ఏ పని చేసినా "బ్రహ్మార్పణం" అంటూ చేసేవాణ్ణి. తరువాత కాకినాడలో గోరా గారి స్నేహం కారణంగా బ్రహ్మ సమాజంతో పేచీ వచ్చినప్పుడు, నిర్గుణ బ్రహ్మను ఉపాసించడమేమిటి ? అనే ప్రశ్న ఉదయించింది. ఏదైనా గుణం వున్న శక్తిని కదా మన ఉపాసనలూ, ఆరాధనలూ, జపాలూ ఆకర్షించడం ? నిర్గుణ నిరాకార పదార్థానికి ఏం తెలుస్తుంది ? ఈ తర్కంతో, బ్రహ్మార్పణ అనే కంటే అట్టి పరబ్రహ్మకు రూపకల్పనలైన శివుడు, విష్ణువు వంటి ప్రతీకలు (సింబల్స్) పట్లనే మన భక్తిని ప్రకటించుకోవడం ఉచితంగా ఉంటుంది కదా అనే నిర్ణయానికి వచ్చాను. అప్పటినుంచి నేను విశ్వోదయానికి ప్రత్యక్ష ప్రతీకగా కల్పించబడి వున్న పరమశివుడి పేర "శివార్పణం" అంటున్నాను.

"ఈయన దేవుడు లేడంటాడు. దారిలో ఏ గుడి కనిపించినా వెళ్ళి , చూచివస్తాడు. బ్రహ్మావాది నంటాడు. విగ్రహారాధన చేస్తాడు" అంటూ నన్ను విరుద్ధ భావాల రాశిగా విమర్శిస్తూ వుంటారు కొందరు. నా రచనల్లో కూడా ఎన్నో వైరుధ్యాలను చూపుతూ వుంటాను. "సృష్టిలో ఎన్ని వైరుధ్యాలు వున్నాయో అన్ని వైరుధ్యాలూ నా సాహిత్య సృష్టిలో కూడా వుంటాయి. వుంటే తప్పేమిటి? " అంటూ.

## 10

నేను ఏ గుడికి వెళ్ళినా సరదా కోసమే. అక్కడికి రకరకాల జనాలు, భక్తులు, స్త్రీలు, పురుషులు ఎంతోమంది వస్తూవుంటారు. నిజమైన మానవ ప్రవర్తనను చూడాలంటే అక్కడే చూడాలి. వాళ్ళందరినీ చూస్తూ గంటల కొలదీ, రోజుల కొలదీ కూడా గడిపేయవచ్చు.

గుడిలోని విగ్రహమూర్తిని దర్శిస్తాను. జనంతో కలిసి అక్కడి సంప్రదాయాలన్నింటినీ పాటిస్తాను. నే నెప్పుడూ ఏ వరాలూ కోరను. ఆ గుడిలో ఏ గుణానికి విగ్రహ రూపంగా పరమాత్మ వున్నదో, ఆ శక్తికి అనుగుణమైన వరాలను నేనే ఇస్తాను. అంటే నేను గుడికి ఏదో కోరడానికి వెళ్లను. నాదైన శక్తిని విశ్వాత్మకు ఇవ్వడానికి వెళతాను.

పరమాత్మ అంటే ప్రకృతి పురుష సమైక్య శక్తి. అది త్రిగుణాత్మకం. త్రిగుణాలు పరస్పర సమ్మేళనంతో లక్షల, కోట్ల మిశ్ర గుణాలవుతై. ఈ అన్ని గుణాలకూ మానవుడు ప్రతీకలనూ, విగ్రహ మూర్తులనూ సృష్టించు కోగలడు. ఆ గుణాలకు ఆయా సామర్థ్యాలను ఆపాదించి జప తప పూజాదుల ద్వారా తాదాత్మ్యం చెందగలడు. విగ్రహం భౌతికమైనదైనా, దానికాపాదించబడిన గుణాలు పరమాత్మీయమైనట్టివే కదా ? పరమాత్మీయ గుణ శక్తులు నాలోనూ వున్నాయి కదా ? కనుక, విగ్రహంలోని గుణశక్తికి విశ్వ కళ్యాణం కోసం నాలోని గుణశక్తిని కొంత ధారపోస్తా నన్నమాట.

ఆకాశంలోని పాలవెల్లి (పాలపుంత) అందరూ చూస్తున్నట్టిదే. వీణామండలం నుంచి ఆరుద్రా నక్షత్రం వరకూ పరమ సుందరంగా కనిపిస్తూ వుంటుందది. దానిని

నేను ఒక కవితలో వర్ణించాను. "ఇది విశ్వపాలనలో అలసిపోయిన పరమాత్మ తలనొప్పి భరించలేక తలచుట్టూ బిగించి కట్టుకొన్న తెల్లటి తువ్వాలు" అని. ఆ తలనొప్పిని తగ్గించడానికి నా శక్తిని కొంత సమర్పిస్తూ వుంటాను. యాస్ప్రిన్ లాగా.

## 11

విశ్వ ప్రవర్తన, విశ్వ చైతన్యం భావాత్మకం కనుక, జీవకోటి – ముఖ్యంగా మానవకోటి వెలిబుచ్చే భావాలన్నీ విశ్వచైతన్యంలో చేరిపోతూ వుంటై. విశ్వచైతన్యం ఒక ఉమ్మడి నిధి అనుకుంటే జీవ భావాలన్నీ ఆ నిధిలో చేరిపోతాయన్నమాట.

మన భావాలన్నీ విశ్వ చైతన్యంలో చేరిపోతుంటై. అందులో నుంచే మనకు మళ్ళీ మళ్ళీ భావాలు తిరిగి కలుగుతూ వుంటై. పరమాత్మకూ, జీవాత్మకూ నడుమ వున్నది. నిరంతర భావ సంబంధమే. పైసలు చేతులు మారేటట్టే, భావాలు తలలు మారతై.

నదులన్నీ సముద్రంలో కలుస్తై. సముద్ర జలాల నుంచే మళ్ళీ నదులు పుడుతూ వుంటై. ఎన్ని నదులు ఎంత బురద నీటిని సముద్రానికి చేర్చినా, సముద్రం తిరిగి ఇచ్చేది – స్వచ్ఛమైన మంచినీటినే.

ప్రకృతి సంబంధమైన ఈ రెండు ఘటనలకూ, రెండు ప్రతీకలు కనిపిస్తారు నాకు ఏసునాథుడు, గణనాథుడు. మానవుడి సర్వపాప పంకిలాన్ని మోసుకుపోయే కరుణామయుడు ఏసునాథుడు. సర్వ శుభాలనూ (శుక్లాంబరధరం) తీసుకువచ్చేవాడు గణనాథుడు. ఈ అపూర్వమైన భావం నాకు కలిగినందుకు ఆ క్షణంలో నన్ను నేనే ఎంతో అభినందించుకొన్నాను.

ఈ ఉమ్మడి నిధి భావనకు సంబంధించి నా జీవితంలోనే ఎన్నో నిదర్శనాలు కనిపిస్తూ వుంటై. గాఢమైన భావాలు ఈ నిధి ద్వారా ఎక్కడెక్కడికో పయనించి ఫలిస్తుంటై.

## 12

నేను విద్యార్థిగా వుండగా వ్రాసి, దేశి కవితామండలి వారిచే ముద్రించబడిన మొట్టమొదటి కావ్యం 'మధుబాల'. జాతీయోద్యమం నాటి భగత్‌సింగ్ లాంటి ఒక

టెర్రరిష్టు క్రమంగా సర్వోదయ వాదిగా మారిన ఇతివృత్తం కలిగినట్టిదది, ప్రేమ, దేశభక్తి గంగా యమునల్లా కలిసి ప్రవహించిన సరస్వతి అది.

టెర్రరిజాన్ని సర్వోదయంగా మార్చడంలో నా ఉద్దేశం కాంగ్రెసు పాలనలో భారతజాతి ఒక మంచి సోషలిస్టు సమాజంగా రూపొందగలదన్న విశ్వాసం. సర్వోదయం అంటే నా ఊహలో మానవతా ప్రధానమైన ఒక సంక్షేమ సమాజం. వర్గ ప్రధానం కాదు, సర్వమానవ బహుముఖాభ్యుదయ ప్రధానం. "సర్వోదయ" శబ్దానికి నేను కల్పించుకొన్న అంతటి ఉన్నత రూపం, గజనీ మహమ్మదు చేతిలో సోమనాథ ప్రతీక వలె, వృద్ధనాయకుల చేతిలో ఛిన్నాభిన్నమైపోయింది. ఇప్పుడు నామరూపాలు కూడా లేకుండా పోయింది.

అయినా, మధుబాల అజరామరమైన ఒక సుందర, సుమధుర భావ కావ్యం, భారతదేశానికి ఒక జాతీయ సోషలిస్టు విధానాన్ని కాంతా సమ్మితంగా ప్రతిపాదిస్తున్నది.

## 13

జిన్నాగారి ద్విజాతి సిద్ధాంతానికి ప్రతిగా అంబేద్కరుగారు త్రిజాతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించారే తప్ప అది నిజంగా ఆచరణ సాధ్యమని గానీ, ఆచరణ యోగ్యమని గానీ ఆయన భావించి ఉండలేదని నా ఉద్దేశం.

డాక్టర్ అంబేద్కర్ అంటరానితనం కారణంగా ఎన్ని బాధలు పడ్డాడో అన్ని బాధలూ నేనూ పడ్డాను. నేనే కాదు. ప్రతి అంటరానివాడూ ఆ బాధలన్నీ పడ్డవాడే. అయితే, అంబేద్కరుకూ, తక్కిన అస్పృశ్యనాయకులకూ ఒక్క తేడా మాత్రం వుంది. తక్కిన వాళ్ళు సవర్ణకులాధిక్యం గల కాంగ్రెస్ పార్టీనో, కమ్యూనిస్టు పార్టీనో అనుసరించి వున్నవాళ్ళు. అంబేద్కరు అలా కాక స్వతంత్రంగా వుంటూ నిమ్న జాతుల దాస్య విముక్తికోసం బరిలో దిగినవాడు.

వేముల కూర్మయ్య, బి.ఎస్. మూర్తి , జగ్జీవన్‌రాం, దామోదరం సంజీవయ్య, కొత్తపల్లి పున్నయ్య, కందికట్ల నాగభూషణం వంటి హరిజన విద్యాధికులు అస్పృశ్యతా

నిర్మూలన విషయంలో, హరిజన అభ్యుదయం విషయంలో తక్కువ దీక్ష కలవారు కాదు. వీళ్ళు కాంగ్రెస్‌లోనో, కమ్యూనిష్టు లోనో వుండడం వల్ల పోరాట విధానంలో కొన్ని పార్టీ పరిమితులకు లోబడక తప్పలేదు.

అంబేద్కరు స్వేచ్ఛగా ఏ అడ్డూ లేకుండా ఎడా పెడా పోరాడి తుది విజయం సాధించి, ఏకైక నాయకుడైనాడు. మహామేధావి కనుక మొత్తం స్వతంత్రభారతావనికే న్యాయప్రవక్త అయినాడు.

## 14

గాంధీ, అంబేద్కరు సమకాలికులు, రాజకీయ, సాంఘిక రంగాలలో ప్రత్యర్థులు – ముఖాముఖి పోరాడుకొన్నవాళ్ళు, పోరాట సందర్భంలో అవసరాన్ని బట్టి పరస్పరం విమర్శించుకొన్నవాళ్ళు, నిందించుకొన్నవాళ్ళు. అంబేద్కరు ప్రత్యర్థి నాయకుడు కనుక గాంధీజీని ఎక్కువగా తిట్టి వుండవచ్చు. హిందూ సామాజిక వ్యవస్థను పీకి పందిరేసి వుండవచ్చు. అది సహజం. గయోపాఖ్యాన నాటకంలో కృష్ణుడూ, అర్జునుడూ ప్రత్యర్థులై పరస్పరం ఎంత ఘోరంగా తిట్టుకున్నారో ఆ నాటకం చదివిన అందరికీ తెలుసు, అలాగే రామాంజనేయ యుద్ధంలో రాముడూ, ఆంజనేయుడూ – సమకాలీన రాజకీయ పోరాటాలలో ఆరోపణలూ, ప్రత్యారోపణలూ తప్పవు.

అందువల్ల గాంధీజీని అంబేద్కరు తిట్టాడు కదా అని మనమూ తిట్టడం వివేకం కాదు.

అందుకే సర్వభారత జాతికీ వాల్మీకీ, వ్యాసుడూ వంటి మా హరిజన మహర్షులే మూల పురుషులన్న సిద్ధాంతాన్ని నేను సనాతన వాఙ్మయం నుంచి పునరుద్ధరించి ప్రతిపాదించడం జరిగింది. ఈ నా వాదాన్ని ఏ బ్రాహ్మణ పండితుడూ, ఏ హిందూ మతాధిపతీ ఖండించి వుండలేదు, పైగా, చాలమంది సమర్థించారు కూడా.

మధ్యలో వచ్చిన కుల వ్యవస్థను సడలించి అస్పృశ్యతా మాలిన్యాన్ని

నిర్మూలించినప్పుడు, ఏకైక భారతజాతి మహోజ్వలంగా వికసించగలదు కదా? తదితర మతాలన్నిటినీ నిరాకరించి బౌద్ధమతాన్ని స్వీకరించడంలో అంబేద్కరు గారి ఆంతర్యం కూడా ఇదే కాదా ?

ఇదీ నా ధోరణి, రాజకీయంగా, సాంఘికంగా నా రచన లన్నింటి లోనూ.

ఇక్కడొక విషయం చెప్పాలి. నేటి కులవ్యవస్థా, వేదకాలం నాటి వర్ణ వ్యవస్థా ఒక్కటి కావు. ఇది వేరు అది వేరు. ఆనాడు వర్ణం అంటే వృత్తి. ఆర్యులు ఒకే జాతి కనుక తెలుపు, ఎరుపు, నలుపు రంగుల్లో వుండరు. ఒకే రంగులో వుంటారు. అక్కడ వర్ణం అంటే రంగు కాదు, వృత్తి. విద్యావంతులుగా, క్షాత్ర వంతులుగా, వ్యాపారస్తులుగా మూడు వృత్తులతో కూడిన జాతి ఆర్యజాతి అంటే యుద్ధాలలో ఓడిన భారతీయులు బానిసత్వాన్ని నాలుగవ వృత్తిగా చేపట్టారు. అప్పుడు త్రైవర్ణికులు చాతుర్వర్ణీకు లయినారు.

జన్మతః వచ్చేది వృత్తి వ్యవస్థ కాదు. కుల వ్యవస్థ. ఇది స్మృతుల కాలం నుంచీ ఏర్పడినట్టిది. జాతిని విచ్ఛిన్నం చేసినట్టిది. ఇప్పుడు మనం నిర్మూలించా లనుకుంటున్న దుష్ట వ్యవస్థ ఈ కుల వ్యవస్థే. ఇది వైదిక వర్ణ వ్యవస్థకు చెందినట్టిది కాదు. తద్విరుద్ధమైనట్టిది.

అయితే, ఈ సందర్భంలో నా సాహిత్యాన్ని చదివే సహృదయులకు ఒక్క విషయం గట్టిగా మనవి చేయదలిచాను.

వాల్మీకికి తన సమకాలీనుడైన రాముడు కథానాయకుడు. ఆయన చరిత్ర తన కావ్యానికి ఇతివృత్తం. నాకు నా సమకాలీనుడైన పాలేరు వెంకన్న కథానాయకుడు. ఇతని జీవితం నా పాలేరు నాటకానికి ఇతివృత్తం. అలాగే నాకు నా సమకాలీనుడైన డాక్టర్ అంబేద్కర్ కథానాయకుడు. ఈయన జీవితమూ, కృషీ నా అంబేద్కర్ సుప్రభాతం, అంబేద్కర్ మతం, అంబేద్కరిజం పాటలలో అంబేద్కర్ వంటి రచనలకు ఇతివృత్తం.

ఎవరైనా గమనించవలసిన మరొక వాస్తవం ఏమిటంటే, నేను సాంఘిక రాజకీయ విషయాలను ఇతివృత్తాలుగా తీసుకొన్నప్పటికీ, నేను వ్రాసేది కవిత్వమే, నేను నిర్మించేది సాహితీ శిల్పమే.

## 15

నేను కౌన్సిల్ సభ్యుడిగా (1978 –84) వుండగా అసెంబ్లీ అయిదేళ్ళ టర్ములోనూ నలుగురు ముఖ్యమంత్రులు మారారు. నా సభ్యత్వానికి కారకులు డాక్టర్ మర్రి చెన్నారెడ్డి గారు. ఆయన తరువాత అంజయ్యగారు ముఖ్యమంత్రి అయ్యారు. తన మంత్రివర్గంలో 60 మందిని నియమించు కొన్నారు. అప్పుడు నేనొక కవిత చెప్పాను.

దేశాధినేత రెండు గుఱ్ఱాలతో నడిపించిన రాజ్యరథానికి
అరవయి ఆబోతులను పూన్చావా రాజ్య సారధీ !
అవి ఎటు ఎలా నడుస్తా యనేది దేవుడెరుగు,
వాటన్నిటికీ గడ్డీ గాదం ఎక్కడ నుంచి తెస్తావ్ ?

ఈ కవితను విన్న అంజయ్యగారు, "భీమన్నగారూ ! మీరు అప్పుడే నన్ను కలిసివుంటే, అందులో మీరు కూడా ఒక ఆబోతు అయివుండేవారు" అన్నారు. అంజయ్యగారిలో అమాయకంగా కనిపించే అత్యంత లలితమైన హ్యూమర్ ఎంత ఉందో చూడండి !

అప్పటికి దాశరథిగారు ఆస్థానకవిగా ఉన్నారు. నిజానికి ఆ స్థానంలో నేనుండవలసిన వాణ్ణి. అది వేరే కథ.

విషయం అర్థం చేసుకున్న అంజయ్యగారు నన్ను కూడా ఒక ఆస్థాన కవిగా నియమిస్తూ ఒక నిర్ణయం తీసుకున్నారు. ఆ వార్త పత్రికలలో పడింది. అయితే, జీఓ రాలేదు. అందుకు సంబంధించిన ఫైలు అదృశ్యమై పోయి, అంజయ్యగారు పదవినుంచి దిగిపోయేవరకు కనిపించలేదు.

## 16

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే అకాడమీలను రద్దు చేసింది. తరువాత విధాన పరిషత్తు (కౌన్సిల్)ను రద్దు చేసింది. ఇంకా ఎన్నో రద్దులు చేసి, రద్దుల ప్రభుత్వం అనిపించుకొంది. ఈ రద్దులన్నిటికీ నేను వ్యతిరేకమే, ముఖ్యంగా కౌన్సిలును, అకాడమీలను రద్దు చేయవద్దని అవకాశం కలిగినప్పుడెల్లా వాదించేవాడిని, విమర్శించేవాడిని, తెలుగు మాటలనూ, సామెతలనూ సంధించి తిట్టేవాణ్ని. చివరగా ఎన్.టి.ఆర్. గారి కళాహృదయానికి అప్పీలు చేస్తూ బ్రతిమాలాను కూడా, ఆయన హృదయం ఏమాత్రం కరగలేదు.

ఆ తరువాత ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ గెలిచింది. గెలవగానే తెలుగు దేశం రద్దు చేసిన సంస్థలన్నిటిని పునరుద్ధరిస్తారనుకొన్నాను. కాని అట్టివేమీ జరగలేదు – కౌన్సిల్‌ను పునరుద్ధరిస్తూ అసెంబ్లీ తొలి సమావేశంలోనే తీర్మానం చెయ్యబడుతుం దనుకొన్నాను. అసలు ఆ ప్రస్తావనే రాలేదు.

అకాడమీలన్నీ పునరుద్ధరించబడతాయనీ, ఆస్థాన కవిగా నన్ను నియమించిన ఫైలు వెలికి తీయబడుతుందనీ నిజంగానే ఆశించాను. అలాంటిది ఏమీ జరగలేదు. రాజకీయాలు అంతగా ధనదుర్గంధితాలు, స్వార్థ పదవీ కంటకితాలు, అవినీతి పైశాచికాలు, కులకలుషితాలు అయిపోయాయి !

## 17

ఇందిరాజీ ప్రధానమంత్రిగా వున్నప్పుడు ఒక ప్రతిపాదన చేసింది. మన దేశానికి అధ్యక్ష తరహా ప్రభుత్వ విధానమే అనుకూలంగా వుంటుందని.

అయితే, ఆ ప్రతిపాదనకు తగు బలం లభించలేదు. పత్రికల నిండా వ్యతిరేకతే వెల్లడి కాసాగింది. దానిపై నిష్పక్షపాతమైన చర్చ జరగలేదు. ఒక ప్రధానమంత్రి నుంచి వచ్చిన అంత గొప్ప ప్రతిపాదన ఆ విధంగా నీరుగారి పోయినందుకు

దేశంలో ఎవరైనా బాధపడ్డారో లేదో గాని, నేను మాత్రం దుఃఖించాను, భారత జాతి వ్యతిరేకు లెవరో బలమైన కుట్ర ద్వారా ఆ ప్రతిపాదనను నీరుగార్చారనిపించింది. ఆనాటి నుంచీ నాకు అదే ధ్యాస అయింది.

అధ్యక్ష తరహా పాలన కూడా ప్రజాస్వామికమే. అమెరికాలో అటువంటి విధానమే అమలులోవుంది. బ్రిటన్‌లోది కూడా ప్రజాస్వామికమే. అయినా, అక్కడ రాజరిక పద్ధతి అమలులో వుంది. ఆ దేశాలు స్థిరంగా, బలంగా అభివృద్ధి పొందడానికి వాటి పరిపాలనా పద్ధతులలోని దృఢత్వమే హేతు వనవచ్చు.

ఏదో ఒక నియోజకవర్గం నుంచి ఎన్నుకోబడిన వ్యక్తి ఎంత గొప్పవాడైనా తన నియోజకవర్గ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తాడు. అంతేకాదు. ఆ నియోజకవర్గంలో ఏ కులం, ఏ మతం వోటర్లు అధికంగా వుంటే అట్టివాళ్ళ స్వప్రయోజనాలకు తలవంచుతాడు. ఈ పద్ధతే దేశం స్వతంత్రమైన నాటినుంచీ కూడా జాతిని నిర్వీర్యం చేస్తూ వస్తున్నది.

ఒక్క నియోజకవర్గానికి బాధ్యుడైన వ్యక్తి, మొత్తం దేశాన్నంతటినీ పాలించేకంటే, మొత్తం దేశంలోని వోటర్లందరిచేతా ఎన్నుకోబడిన వ్యక్తి సర్వాధికారాలు గల ప్రధానమంత్రో, ప్రెసిడెంటో కావడం ఎక్కువ శ్రేయస్కరం కదా ! అప్పుడు దేశాధ్యక్షుడు ఏ సంకుచితవర్గానికి మొత్తం దేశం ప్రయోజనాలను బలిపెట్టడు కదా !

ఆనాటి ఇందిరాజీ ప్రతిపాదన సర్వజనామోదం పొందాలనీ, అమలు జరగాలనీ ఎంతగానో కోరుకున్నాను. తన ప్రతిపాదనకు నా మద్దతును ఆవిడకి లేఖలద్వారా తెలుపుకొన్నాను. అప్పుడది మరుగునపడిపోయినా, ఇప్పుడిప్పుడే తిరిగి చిగురిస్తూవున్న వార్తలు వస్తున్నై. శుభం భూయాత్.

ఇక్కడ మరొక మాట చెప్పాలి. ఈ దేశ పరిపాలనా విధానాన్ని అధ్యక్ష తరహా విధానంగా మార్చవలసివుంటుంది నిజమే. దానితో పాటు పార్టీ పద్ధతిని

కూడా మార్చవలసివుంటుంది. ఆమెరికాలోవలె రెండే పార్టీ లుండడం శ్రేయస్కరం. రెండు పార్టీలు కంటే ఎక్కువ వుండకూడదు.

## 18

కుల వ్యవస్థ నిర్మూలన కానిదే, కనీసం కులాల మధ్య పెంచబడుతూ వచ్చిన రాతిగోడలు కూలనిదే ఈ దేశంలో జాతీయ సమైక్యం సాధ్యం కాదనేది నా దృఢోద్దేశం. అందుకు నేను చేస్తూ వచ్చిన ప్రతిపాదనలు ముఖ్యమైనవి రెండు. ఒకటి – మతం మార్పిడివలెనే కులం మార్పిడిని కూడ చట్ట సమ్మతం చేయడం, రెండు – కులాల పేరుతో దూర దూరంగా వున్న పేటలను, ముఖ్యంగా హరిజన పేటలను తొలగించి, వాటిని ప్రధాన గ్రామాలకు చేర్చి కట్టడం.

నా రచనలన్నిటా ముఖ్యంగా ధర్మం కోసం పోరాటం గ్రంథంలో ఈ ప్రతిపాదనలను ప్రణాళికా రూపంలో ఇచ్చాను.

వర్ణాంతర, కులాంతర, మతాంతర వివాహాలద్వారా సమైక్య జాతీయత రూపొందగలదన్న మేధావుల ఊహలు అపోహలే అని కూడా నా నమ్మకం. ఎందుకంటే, వేదకాలం నాటి నుంచీ కూడా వర్ణాంతర వివాహాలు ఎన్నో జరుగుతూనే వస్తున్నై. జాతీయ సమైక్యత మాత్రం ఎక్కడిదక్కడే వుండిపోతున్నది.

ఈ ఉద్దేశాన్ని వ్యక్తం చేస్తూ ఆ నాటి ఒక హరిజన శాసనసభ్యుడు సాకేటి గురువులుగారు మద్రాసులో ఒక బ్రాహ్మణ అమ్మాయిని పెళ్ళి చేసుకొన్నప్పుడు ఒక పద్యం వ్రాశాను. పద్యం జ్ఞాపకం లేదు. భావం మాత్రం ఇది...

“అనాడు బ్రాహ్మడైన వశిష్టుడు ఒక హరిజన మహిళను పెళ్ళాడి గొప్ప వాడైనాడు. ఇప్పుడు హరిజనుడవైన నీవు ఒక బ్రాహ్మణ మహిళను పెళ్ళాడి అంతకంటే గొప్పవాడి వనిపించుకున్నావు. ఓ గురువులు వర్యా ! మన స్వతంత్ర భారత సమైక్యానికి నీవే ఆదర్శప్రాయుడవైన ఉత్తమోత్తమ గురువువు.”

నేను ఎన్నెన్నో జాతీయాభ్యుదయకరాలైన ప్రణాళికలను నా సాహిత్యం నిండా వెదజల్లుతూ వచ్చాను. ఇంతవరకూ పట్టించుకొన్న వాళ్ళే లేరు. ఇతర కులాలవాళ్ళు ఉపేక్షిస్తారు, హరిజనులు ఇంకా అంత ఎత్తుకు ఎదగలేదు.

# 19

"మీరు రిటైరవుతున్నారు. పెన్షను కూడా ఎక్కువేం రాదు. మరి మీ తర్వాత కార్యక్రమం ఏమిటి? మా రంగంలోకి వచ్చేసారా ?" అన్నారు, సారథీ స్టూడియోస్‌కి చెందిన వై.ఆర్.కె. ప్రసాద్‌గారు, ఒక రోజున ఆఫీసుకి వచ్చి.

ఆంధ్రప్రదేశ్ అనువాద శాఖ డైరెక్టరుగా పదేళ్ళు పనిచేసి రిటైర్ అవుతున్న చివరి రోజులివి. ప్రసాద్‌గారు నాకు బాగా తెలుసు. విజయవాడలో నాకు వేముల కూర్మయ్యగారి పరిచయం కలిగినప్పటినుంచీ కూడ కూర్మయ్యగారి ఆత్మీయులైన చల్లపల్లి రాజా వారి బంధుమిత్ర వర్గంతో కూడ నాకు పరిచయం ఏర్పడివుంది. అయితే, ఏ పరిచయాలనూ ఫలవంతంగా పెంచుకునే స్వభావం కాదు నాది.

ప్రసాద్‌గారు అలా అంటూ, సినిమాలలో పాటలు వ్రాసే అవకాశం తాను కల్పిస్తాననీ, స్వయంగా ప్రోత్సహిస్తాననీ చెప్పారు. నేను ఆలోచించి చెపుతానన్నాను. ఆ తర్వాత ఆయన "ఆలోచించారా ? ఆలోచించారా ?" అంటూ కనిపించినప్పుడెల్లా అడుగుతూ ఉండేవారు. చివరకు ఒకసారి ఏదో ఒక మాట చెప్పవలసిందిగా ఒత్తిడి చేయగా నేనిలా అన్నాను:

"సినిమారంగం గురించి నాకు బాగా తెలుసు. అక్కడ కుల రాజకీయాలకే పట్టాభిషేకం. మీరొక్కరూ నన్ను అభిమానిస్తే చాలదు. అంతే గాక, సినిమా కవి అంటే ప్రొడ్యూసరుకూ, డైరెక్టరుకూ, సంగీత దర్శకుడికీ, గాయకుడికీ కూడ లొంగి వుండవలసి వుంటుంది. వాళ్ళందరినీ తృప్తిపరుస్తూ పాటలు వ్రాయవలసి వుంటుంది. అక్కడ ప్రజలు విని ఆనందించేది స్వర మాధుర్యాన్నే తప్ప సాహిత్యాన్ని కాదు.

సంగీత దర్శకుడు ఇచ్చే ట్యూనుకు అనుగుణంగా ఏవో కొన్ని అందమైన మాటలు పేర్చి పెట్టడమే కవి పని. ఆ రకమైన సినిమా కవిగా నేను ఒక తాత్కాలిక కీర్తిని గడించదలచుకోలేదు.

"పైగా, ఈనాడు సినిమా రంగం కళా రంగం కాదు. అది కేవలం ఒక వ్యాపారంగా, ఒక పరిశ్రమగా లాభాలను గడించటమే ప్రధాన లక్ష్యంగా నిర్వహించబడుతున్నట్టిది. ప్రజా క్షేమాన్ని మట్టిలో కలుపుతూ క్రైమును, సెక్సును నాటుసారావలె యువతరానికి మప్పుతున్నట్టి దది."

ప్రసాద్‌గారికి కొంచెం కోపం వచ్చినట్టుంది. "సినిమా రంగం ఏమయిపోతే మనకెందుకు ? మీరు చేయవలసింది పాటలు వ్రాయటమే కదా ?" అన్నారు. నేటి సినిమా పాటలలో సాహిత్యానికి గానీ, ఔచిత్యానికి గానీ ప్రాధాన్యం లేదంటూ, నేను కొన్ని ఉదాహరణలిచ్చాను.

"నిన్న లేని అందమేదో నిదుర లేచె నెందుకో " అనే పాటనే తీసుకోండి. నిన్నలేనిది నేడు పుడుతుందే కానీ నిదుర లేవదు. పైగా, "ఎందుకో ? " ఏమిటి ?

మరోపాట చూడండి. "నడిరేయి ఏ జామునో స్వామి నిను చేర దిగి వచ్చును" ఈ పాట మొత్తమంతా అనౌచిత్యమే. అది పద్మావతీ దేవిని తక్కువ చేసి అవమానిస్తుండడమే కాక, భక్తులను కూడా కోరరాని కోరికలు కోరే ధూర్తులుగా చిత్రిస్తున్నది.

ఇంకొకపాట "శ్రీదేవి వంకకు చిలిపిగా చూడకు, అలిమేలు మంగకు అలుక రానీయకు" అంటూ వేంకటేశ్వరస్వామికే ఏ భార్యను ఎలా చూసుకోవాలో బోధిస్తున్నది. పైగా, అలుక వచ్చేది పెద్ద భార్య శ్రీదేవికి, చూచేది చిలిపిగా చిన్న భార్య మంగవంకా కదా ! ఈ మాత్రం ఔచిత్యం కూడా తెలియకుండానే సినిమా కవి దేవుడికే కామశాస్త్రం బోధిస్తాడు !

ఇలా అనౌచిత్యానికి, అసంబద్ధతకూ, అకవితకూ చాలా సినిమా పాటలను ఉదాహరించవచ్చు. అయ్యా, నేను ఇలాంటి పాటలు వ్రాయలేను." అన్నాను నేను ప్రసాద్‌గారితో. అంతటితో ఆయన నన్ను వదిలేసి వెళ్ళిపోయారు. అయితే ఆయన స్నేహం మాత్రం నార్లవారి ద్వారానూ, ఎల్. బుల్లయ్యగారి ద్వారానూ కొనసాగుతూనే వచ్చింది.

## 20

సినిమా పాటల్లోనే కాదు – పూర్వకవుల రచనల్లో కూడా అనౌచిత్యాలు చాలానే వున్నై.

ప్రహ్లాదుడు గురించి, అతడు "పంచాబ్దంబులవాడు" అంటే అయిదేళ్ళ బాలుడు అని చెపుతూనే, పోతన్నగారంటారు. "కన్నుదోయికి అన్యకాంతలడ్డంబైన మాతృ భావన చేసి మరలు వాడు" అని ! అయిదేళ్ళ పిల్లవాడికి అన్యకాంతలు మరింకెలా కనిపిస్తా రని ?

ఆంధ్రకవితా పితామహుడైన పెద్దన్నగారు చంద్రుణ్ణి "గోవధము చేయు తురకల" కు దైవంగా ఇచ్చేశారు. చంద్రశేఖరుడికి ఎంత అపకారం చేశాడో చూడండి. చంద్రుడు కుష్ఠురోగిగా కనిపించడం, కాళ్ళుతెగి పడివున్న ఒంటరి ఒంటెగా కనిపించడం వంటివన్నీ ఆధునిక మహాకవులలో కలవు.

సృష్టిలో అందం, వికారం, అనేవి లేవు. మానవుడి దృష్టికి మాత్రమే అవి అలా కనిపిస్తాయి. అప్పుడైనా వికారంగా కనిపించే వస్తువులో అందాన్ని చూడగలగడమే కళాదృష్టి. కవితా కర్తవ్యం. అందమైనదాన్ని అసహ్యకరంగా చిత్రించడం కళా లక్షణం కాదు. కవితా లక్షణమూ కాదు. అందుకే ఆ రకమైన వాళ్ళను నేను అకవు లన్నాను.

ఎప్పుడో ఒకసారి విశ్వనాథ సత్యనారాయణ గారన్నారు, 'ఆనాటి సరస్వతి వేరూ, ఈనాటి సరస్వతి వేరూ" అని. దానికి జవాబు, 'సరస్వతి వేరు వేరు కాదు. నాడు నేడు సరస్వతి ఒక్కర్తె. ఆనాడు కంచిపట్టు చీరలు కట్టింది. ఈనాడు మినీ స్కర్టులు వేస్తున్నది."

కవిత్వాలలో కూడ భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, విప్లవకవిత్వం, పద్యకవిత్వం, గేయకవిత్వం అనేవేవీ లేవు. ఈ పేర్లన్నీ ప్రక్రియల పేర్లు అంటే అనవచ్చు. ఏ ప్రక్రియలో వ్రాసినా కవిత్వం ఒక్కటే. రచనలో రసభావ సౌందార్యాలుంటే, అది కవిత్వం అవుతుంది. సజీవమూర్తి అవుతుంది. లేకపోతే వట్టి రబ్బరుబొమ్మో, గడ్డి బొమ్మో అవుతుంది.

ఈనాడు కవిత్వం పేరుతో వస్తున్న అనేక రచనలు వట్టి ప్లాస్టిక్ బొమ్మలు. వాటికి శబ్దాలంకారాలూ, అనుప్రాసలూ, అంత్యప్రాసలూ, యమకాలూ, గమకాలూ వంటి ఎన్ని అలంకారాలు తగిలించినా సజీవ సాహితీమూర్తులు కాలేవు. ఆత్మానందం కలిగించలేవు. సజీవమూర్తి ఏ అలంకారాలూ లేకపోయినా, కేవలం సాదాసీదా పల్లెటూరిదే అయినా ఆనందం కలిగించేదిగానే వుంటుంది. ఈ ఉద్దేశాన్నే నేను అనేక విధాలుగా అనేక కవితలలో వెల్లడించి వున్నాను.

నా సమకాలీన ఆధునిక కవులను గురించి చెప్పవలసి వచ్చినప్పుడు నాకు ఎక్కువగా ఇష్టమైన వాళ్ళూ, నన్ను ఎక్కువగా ఇష్టపడినవాళ్ళూ ఇద్దరు. అందులో విశ్వనాథ సత్యనారాయణగారు ఒకరు. గుర్రం జాషువాగారు ఒకరు. పోతన్నగారి పద్యాల వలెనే జాషువా గారి పద్యాలు కూడ నాకెంతో తన్మయీభావం కలిగిస్తూ వుంటై.

# 22

విధాన పరిషత్తు (లెజిస్లేటివ్ కౌన్సిల్) గురించి నాకు కొన్ని విశిష్టమైన అభిప్రాయాలు వున్నై. కౌన్సిలులో పార్టీ విధానం వుండకూడదు. పార్టీ విధానం వుండవలసింది అసెంబ్లీలో. సమాజంలోని వివిధ రంగాలకు చెందిన అనుభవజ్ఞులు, మేధావులూ, కళాకారులూ, పారిశ్రామిక వేత్తలూ, సైంటిస్టులూ మొదలైన అగ్రగణ్యులకు నిలయంగా వుండాలి కౌన్సిలంటే, వారి వారి రంగాలకు సంబంధించి ప్రయోజనాత్మకమైన సలహాలను వారు ఇవ్వాలి. అందువల్ల ప్రతి రంగానికి చెందిన అనుభవజ్ఞులైన మేధావులను కౌన్సిలుకు ప్రభుత్వమే నామినేటు చెయ్యాలి.

కౌన్సిలుకు ఎన్నికలు వుండకూడదు. ఏ విషయంలోనూ పార్టీపరమైన వోటింగు వుండకూడదదు. సమస్యను క్షుణ్ణంగా, స్వేచ్ఛగా చర్చించి కౌన్సిలు తన అభిప్రాయాన్ని ప్రభుత్వానికి తెలుపుతూ వుండాలి. ఈ పద్ధతులపై ప్రతి రాష్ట్రానికీ విధిగా ఒక కౌన్సిలును ఏర్పాటు చేయాలి. అది రాజ్యాంగ బద్ధమైన పద్ధతిలో వుండాలి. దానిని రద్దు చేసే అధికారం అసెంబ్లీకే కాదు, మరెవరికీ కూడా వుండకూడదు.

కౌన్సిలు విషయంలో వలెనే ఆకాడమీల విషయంలో కూడా వాటి నిర్మాణం రాజ్యాంగ బద్ధంగానే జరగాలి. ఒకొక కళారంగానికి ఒకొక ఆకాడమీ చొప్పున, ఒకొక ఆస్థాన విద్వాంసుడు చొప్పున నియమించబడాలి.

కళలకు ప్రాణం సృజనాత్మకత, సృజనను పోషించగలవీ, ప్రోత్సహించ గలవీ అకాడమీలు మాత్రమే. యూనివర్సిటీలు కాదు. యూనివర్సిటీలకు ప్రాణం సాంకేతిక నియమ నిబంధనలతో కూడిన పరిశోధన. సృష్టించబడిన దానికి ప్రాచుర్యం కలిగించడం యూని వర్సిటీల కర్తవ్యం. అందుకే తెలుగు కళారంగం ఉన్నతోన్నత సృజనాత్మకతతో పరిపుష్టమూ, పరిఫుల్లమూ కావాలంటే అకాడమీలను పునరుద్ధరించవలసిందే.

## 23

యూనివర్సిటీల విషయంలో కూడా బ్రిటిష ప్రభుత్వ కాలంలో వున్న పద్ధతులే ఉత్తమమైనట్టివని నా భావం. ఈనాటి నామినేషను పద్ధతిలో లోపాలు చాల వున్నై. సెనేటుకు, సిండికేటుకు, అకడమిక్ కౌన్సిల్‌కు ఎన్నికలు జరగడమే ఉత్తమం. ఆనాడు యూనివర్సిటీలు ఎన్నుకోబడిన సభ్యులతో కళకళలాడుతూ వుండేవి. విద్యా సంవత్సరం, పరీక్షల తేదీలు నిశ్చితమైన క్రమ పద్ధతిలో ఉండేవి. ఈనాడు అంతా అనిర్దిష్టంగా, అల్లకల్లోలంగా వుంది. విద్యార్థులలోనూ, ఉపాధ్యాయులలోనూ కూడా క్రమశిక్షణ లేకపోవడానికి, ప్రమాణాలు దిగజారడానికి వాటి నిర్మాణంలోని లోపాలే కారణం.

## 24

దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం జరుగుతున్నప్పుడు విదేశీ ప్రభుత్వంపట్ల అన్ని రంగాలలోనూ ప్రజలలో ద్వేషభావం రేకెత్తించబడడం సహజం. శత్రువులో వుండే లోపాలే తప్ప సుగుణాలు లెక్కించబడవు. స్వాతంత్ర్యం లభించిన తరువాత దృక్పథం మారవలసి ఉంటుంది.

ఆంగ్లేయులు మన దేశంలో ప్రవేశపెట్టిన అన్ని విధానాలూ ఉత్తమమైనట్టివే అని నా ఉద్దేశం. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత వాటిలో వేటినీ మన వదులుకోలేదు. రైళ్ళు, తంతి - తపాలాలు, రోడ్లు, విమానాలు, కార్లు, పోలీసు, మిలటరీ అన్నీ యథావిధిగానే నడుస్తున్నై. అనేక విధాల అభివృద్ధి పరచబడుతున్నై. కాగా, ఒక్క ఇంగ్లీషు పట్ల మాత్రమే వివాదాలను రెచ్చగొట్టడం హాస్యాస్పదం కాదా ?

ఒక్క మన దేశంలోని వివిధ ప్రాంతాలనే కాక, ప్రపంచంలోని వివిధ దేశాలను కూడా దగ్గరగా చేర్చగలిగిందీ, పరస్పరావగాహనను సాధించ గలిగిందీ ఇంగ్లీషు భాష మాత్రమే. మనకు అదొక్కటే జాతీయ భాష కాగలిగిన అర్హత వున్నట్టిది. దానిని వ్యతిరేకించడానికి కారణం కేవలం ప్రాంతీయ, రాజకీయ స్వార్థాలు మాత్రమే.

## 25

"యధార్థవాదీ లోకవిరోధీ" అన్నారు. అందుకు నేనొక ఉదాహరణ. ఎప్పుడూ యథార్థంగా మాట్లాడటం, సత్యమే పలకడం, ఉన్నదున్నట్లు చెప్పడం, త్రికరణశుద్ధిగా ప్రవర్తించడం - ఇవన్నీ మానవ సుగుణాలలో అత్యుత్తమైనట్టివిగా పేర్కొనబడుతున్నాయి. అంత వరకూ బాగానే వుంది.

అయితే, అట్టి నీతి బోధకులు ఎంతమంది వాటిని అనుచరించ గలుగుతున్నారో గమనిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. వాటిని అనుసరించి సుఖంగా బ్రతకడం రమారమి అసాధ్యమని నా అనుభవం. అందరి అనుభవమూ అదే. ఎల్లప్పుడూ నిజమే చెప్పాలనుకోవడం జీవితంలో సుఖశాంతులను కోరుకునేవాళ్ళు చెయ్యగూడని పని. అందుకు మన పురాణాలలో కూడ చాలా ఉదాహరణలే వున్నై.

సత్య హరిశ్చంద్ర నాటకం చూసినవాడెవడూ సత్యం పలకటానికి సాహసించడు కదా !

రాముడు వాలిని చాటు నుంచి కొట్టి చంపకపోతే, సృష్టిలో బంగారు జంతువు లుంటాయని నమ్మకపోతే, విభీషణుడు రాముడి పక్షం చేరకపోతే, రావణుణ్ణి కొట్టగూడని చోట కొట్టకపోతే పర్యవసానం ఎలా ఉండేది ?

ధర్మరాజు చచ్చినా అబద్ధమాడడన్న ప్రగాఢ విశ్వాసం ద్రోణాచార్యుల కుండబట్టే కదా ఆయన విశ్వాసఘాతుకానికి బలైపోయాడు ? ధర్మరాజు యుద్ధరంగంలో అంతటి క్రూరమైన అబద్ధమాడి వుండకపోతే యుద్ధంలో గెలిచి వుండేవాడా ? భీష్ముణ్ణి, కర్ణుణ్ని, దుర్యోధనుణ్ని, జరాసంధుడ్ని, సైంధవుణ్ని, ఇలా మహాబలాఢ్యులందర్నీ చంపింది మోసం తోనే కదా !

అందువల్ల త్రికరణశుద్ధి ద్వారా, యధార్థ ప్రవర్తన ద్వారా, Frankness ద్వారా ఏ రంగంలోనూ జీవితం విజయవంతం కాదు. బంగారానికి టంకం వలె, కొయ్యకు లప్పం వలె, జీవితానికి అసత్యాన్ని అవసరాన్నిబట్టి వాడు కొంటూ ఉండాలి. లోకజ్ఞానం అంటే అది.

నేను అన్ని విషయాలలోను చాలా Frank గా వుంటాననీ, ఎవరిలో ఎట్టి లోపాలు కనిపించినా వారి ముఖంమీదే సూటిగా చెప్పగలుగుతాననీ నా సన్నిహితులు నన్ను పొగడుతూ ఉండటం వల్ల, నేనింకా ఉబ్బితబ్బిబ్బై పోతూ మరీ ఓజీబిదీది గా వుంటూ వచ్చాను. మరీ సూటిగా మాట్లాడుతూ వచ్చాను. ఈ నా సత్య హరిశ్చంద్రత్వం నాకు జీవితం పొడుగునా చాలా ఇబ్బందులు తెచ్చి పెట్టింది. చాలా అవకాశాలను అందకుండా చేసింది. నన్ను అభిమానించే ఎంతో మందిని దూరం చేసింది. అయినా, నేను పశ్చాత్తాపపడలేదు. పశ్చాత్తాపపడడమనేది నా రక్తంలోనే లేదు.

## 26

నా జీవితం పొడుగునా నాకు సహాయం చేస్తూ వచ్చిన పెద్దలు చాలమందే వున్నారు. వారిలో కొందరినైనా ఇక్కడ స్మరించడం ధర్మంగా వుంటుందను కొంటాను. అందులో ప్రధమంగా పేర్కొనదగినవారు కళా వెంకటరావుగారు. ఆయన నాకు ప్రధమ ప్రధాన ధ్రువ తార !

నేను విద్యార్థి దశనుంచీ కాంగ్రెసు ఉద్యమానికి చేరువగా తిరుగు తుండే వాడిని కదా ! మా ప్రాంతపు కాంగ్రెసు నాయకులలో అగ్రశ్రేణికి చెందిన కళా వారి దృష్టిలో నేనెప్పుడు ఎలా పడ్డానో తెలియదు కాని, అప్పటి నుంచి ఆయన నా పట్ల ప్రసన్నంగా ఉంటూ వచ్చారు. నేను కూడా ఆయన పట్ల భక్తి శ్రద్ధలను ప్రదర్శిస్తూ వచ్చాను. ఆయన కాంగ్రెసు పార్టీలో ఎన్నో పదవులు నిర్వహించారు. మద్రాసు, ఆంధ్ర, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలలో ప్రధానమైన మంత్రి పదవులు నిర్వహించారు. ఆయన ఏ పదవిలో ఉన్నా నన్ను మరచిపోలేదు. ఒక్కొక్క సందర్భంలో నా ప్రవర్తన నచ్చక ఆయనకు విసుగు కలిగినా, ఆయనపై నాకు కోపం వచ్చినా మా మధ్యగల ఆత్మీయతకు భంగం వాటిల్లలేదు.

నా జీవితానికి ఒక స్థాయినీ, వ్యక్తిత్వాన్నీ ఇచ్చినవాడు కళా వెంకటరావు గారే.

అదే వరుసలో పేర్కొనదగిన మహాపురుషులు వేముల కూర్మయ్య గారు, దామోదరం సంజీవయ్యగారు, ఎల్. బుల్లయ్యగారు, బెజవాడ గోపాలరెడ్డి గారు, నైనాల గణేశ్వరరావు గారు, మర్రి చెన్నారెడ్డి గారు.

సాహిత్యపరంగా నన్ను ప్రోత్సహించినవారు గుబ్బల వీరాస్వామి, తాపీ ధర్మారావు, నిడదవోలు వెంకటరావు, నార్ల వెంకటేశ్వరరావు, బొందలపాటి శివరామకృష్ణ, ఎల్. మాలకొండయ్య, జె. బాపురెడ్డి, జె. అమ్ములయ్య, దివాకర్ల వెంకటావధాని, ఆలపాటి సూర్యనారాయణ మొదలైనవారు. ఇంకా చాలామందే వున్నారు కాని, కొద్ది మందిని మాత్రం ఇక్కడ పేర్కొనడం జరిగింది. ఆయా పెద్దలు నాకు ఎప్పుడు ఏ విధంగా తోడ్పడ్డారో చెప్పవలసివస్తే అవన్నీ నా జీవిత చరిత్రలో ప్రముఖ ఘట్టాలే అవుతై. ఇందులో కొన్ని ఉదంతాలు "పాలేరు నుంచి పద్మశ్రీ" గ్రంథంలో పేర్కొనబడి వున్నై.

## 27

ఈ మధ్య దళిత సాహిత్యం అనేది ఒకటి వెలుగులోకి వచ్చింది. దానిని గురించి పత్రికలలోనూ, వేదికల మీదా కూడా వాదోపవాదాలూ, చర్చలూ ప్రారంభమయినై. వాటిలో నా పేరూ, జాషువా పేరూ కూడా పేర్కొనడం జరుగుతూ వుంది.

నిజానికి దళిత సాహిత్యం అనే మాటగానీ, అసలు దళిత అనేమాటే గానీ పుట్టక ముందు నుంచే అస్పృశ్యకులాల విమోచనాన్నీ, అభ్యుదయాన్నీ కోరుతూ నేను అనేక రచనలు చేశాను. జాషువా ఇంకా ముందునుంచే వ్రాస్తూ వచ్చారు. నే నింతకు ముందే చెప్పినట్టు సాహిత్యానికి ప్రక్రియలు వుంటాయే తప్ప కులాలు, జాతులు వుండవు. సర్వమానవ శ్రేయస్సు కోరే విశ్వజనీన కళాకల్పనమే సాహిత్యం అంటే.

ఈ మధ్య ఆంధ్రప్రభలో కాబోలు శివసాగర్ (సత్యమూర్తి) గారు దళిత సాహిత్యం గురించి తన అభిప్రాయాలు వెలిబుచ్చారు. అవి ఆయన దృక్పథాన్ని అనుసరించి బాగానే వున్నై. కాని, నన్ను "దళిత బ్రాహ్మణవాది"గా ముద్రవేయడం అంత బాగాలేదు.

పైగా 'దళిత' 'బ్రాహ్మణ' అనే రెండు పదాలలోనూ దళిత అనే పదం నాకు కిట్టదు. పూర్వం 'నిమ్న' అనేవాళ్ళు. 'నిమ్న' అంటే పల్లం, క్రింద. దళిత అంటే రాలిపోయిన, తెగిపోయిన, పడిపోయిన, పతితమైన. ఆ మాటల అర్థాలను బట్టి 'దళిత' కంటే 'నిమ్న' అనడమే ఎక్కువ గౌరవప్రదం కదా.

దళితులంటే అస్పృశ్యులొక్కళ్ళే కాదు. పతితులైన ప్రతివాళ్ళూ దళితులే. అస్పృశ్యులలో దళితులుండవచ్చు. కాని, అంతకంటే కూడా సమున్నతులు వున్నారు, మేధావులు వున్నారు, విద్యాధికులున్నారు, భూస్వాములున్నారు. కనుక అస్పృశ్యులందరినీ దళితులనడం చాల అన్యాయం. అందుకే, నేను నా సాహిత్యంలో దళిత శబ్దం వాడను, ప్రత్యేక ప్రయోజనమేదైనా వుంటే తప్ప.

నిజానికి అస్పృశ్యకులాలైన దళితుల లక్ష్యం అస్పృశ్యత నుంచి విడుదల అవడం, తమ దళితత్వాన్ని నిర్మూలించుకొని తదితర సవర్ణ కులాలతో సమానమైన స్థాయికి ఎదగడం. దళితులు శాశ్వతంగా దళితులుగా వుండరు. వుండకూడదు. అందుకే నేను వీళ్ళకు హరిజన శబ్దం వాడడం.

## 28

హరిజన అనేది అస్పృశ్యులకు మాత్రమే పెట్టబడిన పేరు. మొట్ట మొదటి హరిజనుడు కృతయుగంనాటి ధర్మవ్యాధుడు. మొట్టమొదటి అస్పృశ్యుడైన (వెలివేయబడి) మతంగ మహర్షికి ధర్మవ్యాధుడు వియ్యంకుడు. మతంగుడి కుమారుడికి తన కుమార్తె నిచ్చినవాడు. ఈ ఉదంతం వేదవ్యాసుడు వ్రాసిన వరాహ పురాణంలో వుంది.

హరిజన అనేది అస్పృశ్యులకు గాంధీజీ పెట్టిన పేరు కాదు. అంతకు ముందున్న పేరునే గాంధీజీ ప్రచారంలోకి తెచ్చాడు. డాక్టర్ అంబేద్కర్ కూడా గాంధీజీకి ప్రత్యర్థి కనుక ఆయన పెట్టిన పేరును విమర్శించాడే తప్ప మరొక ప్రత్యామ్నాయాన్ని సూచించలేదు.

"షెడ్యూల్డు" అనేవి రాజ్యాంగంలోని ఒక షెడ్యూలు (అనుసూచి)లోని కలాలు. షెడ్యూలు పోతే అందులోని కులాలూ పోతై. అసలు కుల వ్యవస్థే నిర్మూలనం కావాలన్న అంబేద్కరు కొత్త కుల నామాలకు ప్రాధాన్యం ఇవ్వడు కదా ?

ఇప్పటికే 'హరిజన' శబ్దం దేశ విదేశాలలో బాగా ప్రఖ్యాతి పొంది వుంది. దానిని కాదనడం సాధ్యం కాని పని.

నిజానికి నేను మొదటినుంచీ బ్రాహ్మణవాదినే. బ్రాహ్మణ శబ్దానికి అర్థం "బ్రహ్మజ్ఞాని" అని. "బ్రహ్మజ్ఞానేన బ్రాహ్మణ" అన్నారు. బ్రహ్మజ్ఞానం కలవాడు బ్రాహ్మణుడు.

నిజంగా మతంగ, ధర్మవ్యాధులను మించిన బ్రహ్మజ్ఞాను లెవరున్నారు ? అరుంధతి తమ్ముడు కపిల మహర్షి వేదాంత దర్శనాన్ని ప్రతిపాదించిన మేధావి, మతంగ, ధర్మవ్యాధులు, కపిలుడు, అరుంధతి కొడుకు శక్తి మహర్షి, అరుంధతి మనుమడు పరాశరుడు, పరాశరుడి కొడుకు వేద వ్యాసుడు, అలాగే వాల్మీకి మొదలైన వైదిక ఋషులందరూ పుట్టుకతో హరిజనులు, గిరిజనులే అయినా జ్ఞానంద్వారా బ్రాహ్మణులే కదా ? ఆ వంశానికి చెందినవాణ్ణి నేను. అంతటి ఉత్తమోత్తమ వారసత్వం నాది.

మా అయ్య బోయి పల్లయ్యగారు సాంఖ్య మూలక తత్వవేత్త మాత్రమేకాదు, పరమయోగి కూడా, ఆరు మాసాలపాటు అందరూ అపస్మారం అనుకొన్న యోగసమాధిలో వుండి, వారం రోజుల ముందే తనకు అవసాన క్షణాలు ఎలా సమీపించేదీ చెప్పి, బ్రహ్మరంధ్రాన్ని ఛేదించుకొని బ్రహ్మైక్యం పొందిన పరమహంస

ఆయన. ఈ ఉదంతం పదహారేళ్ళ క్రితం ప్రచురించబడిన నా జీవిత చరిత్రలో ఉంది.

అయితే అస్పృశ్య కులంలో పుట్టినవాడు కనుక ఆయనకు గుర్తింపు రాలేదు. మరొక కులంలో పుట్టివుంటే బ్రహ్మంగారు, రాఘవేంద్ర స్వామి వంటి మహాసిద్ధుల పంక్తిలో దీప, ధూప, నైవేద్యాలందు కొంటూ వుండేవాడు.

శివసాగర్ సత్యమూర్తిగారిని నేనెప్పుడూ చూడలేదు. ఆయనకు రాజకీయుడిగానే తప్ప సాహితీయుడిగా కూడా ఊహించలేదు. సాహిత్యం పట్ల ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు చూసిన తరువాత ఆయనను గొప్ప సాహితీవేత్తగా దర్శించగలిగాను.

## 29

విదేశీయుల పరిపాలన కింద వందల సంవత్సరాలు సమైక్యంగా వున్న భారతదేశం స్వతంత్ర దేశంగా రెండుగా చీలిపోయింది. విదేశీయుల చేతికింద కలిసి బ్రతికిన హిందూ, ముస్లింలు స్వతంత్రదేశంలో కలిసి బ్రతకలేరా? బ్రతకలేమన్న భయంతోనే కదా ఇరుమతాలవారూ ఉమ్మడి ఆస్తిని పంచుకొన్నట్లు దేశాన్ని రెండుగా విభజించి చెరొక వాటానూ తీసుకొన్నారు? మరి ముస్లింలు తమ వాటాను ముస్లిం దేశంగా ప్రకటించుకొన్నప్పుడు హిందువులు తమ వాటాను హిందూ దేశంగా ఎందుకు ప్రకటించుకోలేదు ? ఇదీ అసలు సమస్య.

ఈ సమస్యను అవగాహన చేసుకుని, కలిసి బ్రతకడానికి తమ తమ మత గ్రంథాలలో, మతాచారాలలో ఆటంకంగా వున్న వైరుధ్యాలను సవరించు కొని ఉభయ మతామోదకమైన ఒక మధ్యే మార్గాన్ని అవలంబించకుండా హిందూ ముస్లిం సఖ్యత ఎలా సాధ్యపడుతుంది.

"జాతీయ సమైక్యమో" అంటూ పైపై నినాదాలెన్ని చేసినా, అందుకోసం ఎన్ని కోట్ల రూపాయలను బుగ్గి చేసినా మత వైరుధ్యాలను తొలగించు కోకపోతే జాతీయ సమైక్యం సాధ్యంకాదు.

ఈ వాస్తవాన్ని నేను పదే పదే చెబుతూ వస్తున్నాను. నా Frankness ను, యధార్థ వాదిత్వాన్ని అభినందించవలసింది, కానీ, నన్ను చూసి భయపడుతున్నారు ప్రచార సాధన సంపన్నులు. అసలు సమస్యను కప్పి పుచ్చి ఆత్మవంచన చేసుకునే కొలదీ సమస్య విషమించి దేశసమగ్రతకే ముప్పు తెస్తుందన్న వాస్తవాన్ని ఎవరూ గుర్తించడం లేదు.

రాజ్యంగ నిర్మాణ సందర్భంలో నెహ్రూగారి ప్రియాంబుల్‌కు సవరణగా ప్రతిపాదించబడి, డా॥ అంబేద్కరుచే తిరస్కరించబడిన 'సెక్యులర్' అనే పదాన్ని ఆ తరువాత 42వ రాజ్యాంగ సవరణ ద్వారా తిరిగి ఎందుకు చేర్చవలసి వచ్చిందో ఎవరూ ఎందుకు ఆలోచించడం లేదు ? ఇది నా ప్రశ్న కాదు. దేశమాత పడుతున్న ఆవేదన. తన బిడ్డల స్వార్థ రాజకీయాలను చూస్తూ భారతమాత విడస్తున్న నిట్టూర్పు.

## 30

అంబేద్కరుగారు తాను హిందువుగా చావనన్న శపథం చేసిన తరువాత 20 సంవత్సరాలు పైగా హిందువుడుగానే వుండిపోయాడు. ఆ తరువాత బౌద్ధ ధర్మాన్ని స్వీకరించి రెండు నెలలకే కీర్తి శేషుడైనాడు. ఈ సందర్భంలో అనేక సిద్ధాంత రాద్ధాంతాలను పరిశీలించవలసి వుంది. వాటన్నిటినీ నేను నా అంబేద్కరిజం, అంబేద్కర మతం వంటి గ్రంథాలలో చర్చించి నిర్ణయాలు చేసి వున్నాను.

ఇక్కడ ఒక్క విషయం చెప్పవలసివుంది.

అంబేద్కరు స్వీకరించిన బౌద్ధమతం ప్రపంచ బౌద్ధదేశాలలో అమలులో వున్నట్టిది కాదు. ఆ మతాన్ని ఆయన తనకిష్టమైన విధంగా మలుచుకొని స్వీకరించాడు.

అప్పటికే బౌద్ధమతంలో హీనయాన, మహాయాన శాఖలు ఏర్పడి వున్నాయి.

ఇప్పుడు అంబేద్కర్ సృష్టించిన శాఖను నవయానం అంటున్నారు. అలా అనడంలో అంబేద్కరు వ్యక్తిత్వానికి న్యాయం చేకూరడం లేదు.

అందుకే దానిని అంబేద్కర యానం అనాలంటున్నాను నేను.

మనం అంబేద్కరును ఆరాధించేది మతప్రవక్తగా కాదు. దళిత జనోద్ధరణ కోసం బహు విధాలుగా పోరాడిన ఒక సాంఘిక విప్లవ ప్రవక్తగా.

మతం విషయంలో కూడా ఆయన మనకు మార్గదర్శకుడే అనుకుంటే, ఆయన స్వీకరించిన నవయానాన్ని అంబేద్కరయానం అని గానీ, అంబేద్కర మతం అని గానీ పేర్కొనవలసి వుంది. అంబేద్కరు శరణం గచ్ఛామి అనవలసి ఉంది.

## 31

1960లో కాబోలు - జాషువాగారు నన్ను ఆశీర్వదిస్తూ వ్రాసిన పద్యం ఇది:

*తళుకుల్ బెళ్కులు గల్గు మేల్తెలుగు*
*శబ్దశ్రేణితో, కావ్య భూ*
*షలు సృష్టించి, విరించి బిత్తరి కటాక్ష*
*శ్రీల నార్జించి, కా*
*గలవాడై నుతికెక్కు భీమన కవిన్*
*గన్నట్టి శ్రీ వేంగి మం*
*డల మేరీతి బహూకరించునొ*
*ప్రతిష్ఠావాహ మెక్కించుచున్*

ఆ తరువాత ఎప్పుడో జాషువాని అనేక విధాలుగా ప్రోత్సహిస్తూ, సన్మానిస్తూ వచ్చిన పత్తిపాటి సుబ్రహ్మణ్యంగారు నల్గొండలో ఇంజనీరుగా వున్నప్పుడు, ఆయనను అక్కడకు పిలిచి వెయ్యిన్నూట పదహార్లు వెండి నాణాలు ఇచ్చి సన్మానించిన సందర్భంలో, నేనుకూడా ఎల్లాప్రగడ సీతాకుమారి, డా॥ బి. విజయభారతి, మోదుకూరి జాన్సన్ మున్నగు వారితో వెళ్ళి ఆ సభలో పాల్గొన్నాను. అప్పుడు జాషువాగారి గురించి నేను వ్రాసిన పద్యం -

కుల మనెడి ఊబిలో పడి కొట్టుకొనెడు
భరత గోమాత నుద్ధరింపగ దలంచి
కలము దూసిన విప్లవ కవివి నీవు
జాషువా, నీవె ఋగ్ధర్మ జాతి పితవు

## 32

ఏ హిందూ ముస్లిం కలహాలను శాశ్వతంగా నిర్మూలించడానికి దేశ విభజన జరిగిందో ఆ లక్ష్యాన్ని హిందూ నాయకులు విస్మరించడం కూడా జరిగింది. పాకిస్తాన్ ఒక సమగ్ర సంపూర్ణ ముస్లిం దేశంగా రూపొందింది. అక్కడ హిందూ ముస్లిం సమస్యలేదు. మిగిలిన భారత్‌లో మాత్రం హిందూ ముస్లిం సమస్య ఎప్పటిలాగే కొనసాగించబడింది. దేశ విభజనలక్ష్యం నెరవేరలేదు. అందుకు కారణం అప్పటి పరిశిష్ట భారతదేశపు అగ్రనాయకుల సంకుచిత, స్వార్థ, పదవీ వ్యామోహ విధానమే కాదా ! అనిపిస్తుంది నాకు ఆలోచించేకొలదీ.

ఆనాడు పదవిని చేపట్టిన హైందవ అగ్రనాయకులు తమకు లభించిన భారత భూభాగానికి 'హిందూస్తాన్' అనే పేరు పెట్టివుంటే, ఈనాడు హిందువులను కూడా తమకు తమదైన ఒక స్వదేశం వున్నదన్న తృప్తి వుండేది. హిందూ ముస్లిం కొట్లాటలు కొనసాగివుండేవి కావు. బహుశా అట్టి ఉద్ధేశంతోనే "సెక్యూలర్" అనే పదాన్ని అంబేద్కరు నిరాకరించి వుంటాడు.

ఈ విషయమై అప్పుడే నేనొక కవిత వ్రాసి ఉన్నాను "నాకొక దేశం కావాలి" అంటూ.

"ముస్లింలకు ఎన్నో దేశాలున్నై. క్రైస్తవులకూ, బౌద్ధులకూ కూడా ఎన్నెన్నో సొంత దేశాలున్నై. హిందువులకు మాది అని చెప్పుకోడానికి ఒక్క దేశంకూడా వద్దా ?" అని వ్రాశాను.

వాస్తవానికి ఈ దేశంలో ఆంగ్లేయులే అడుగుపెట్టి వుండకపోతే,

రాజ్యాధికారాన్ని చేజిక్కించుకొని వుండకపోతే ఈ దేశం ఒక దేశంగా కూడా వుండేదేనా ? ఈ దేశంలో హిందూమతం గానీ, దాని సంస్కృతీ చిహ్నాలు గానీ మిగిలేవా ?

ఆంగ్లీయులు ఈ దేశాన్ని సొంతదేశంగా మార్చుకోడానికి రాలేదు. ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పరుచుకోడానికి రాలేదు. ఇక్కడి సంపదను పట్టుకుపోవడానికి వచ్చారు. ఎక్కువ సంపదకోసం దేశాన్ని బహుముఖంగా సంపన్నం చేశారు. దేశం స్వతంత్రమైన తరువాత భవిష్యత్తు ఎలా ఉండాలో జిన్నా ఆలోచించగలిగాడు. గాంధీజీ ఆలోచించలేకపోయాడు. దాని దుష్ఫలితం కనిపిస్తూనే వుననది కదా ?

హిందువులలో వున్న బలహీనత ఏమిటంటే, "నా కోడీ, నా కుంపటి" అన్నట్టు "నా మడీ, నా తడీ" అనుకొంటూ చుట్టూ దడి కట్టుకొని బోడిగా కూర్చోవడం.

తన సొంత మతానికి చెందిన తన జాతివాణ్ణి అంటరానివాడంటూ తరిమికొట్టడం, ఆ తరిమికొట్టబడినవాడు ఏ ముస్లిం వేషమో, క్రైస్తవ వేషమో వేసుకుని తిరగబడితే అతడికి సలాం చేసి కాల్మొక్కడం సవర్ణ హిందువులకు అలవాటైపోయింది. ఆ అలవాటే మొత్తం జాతిని బానిస జాతిని చేసింది. ఇప్పటికీ ఈ జాతికి జ్ఞాన సూర్యోదయం కాలేదు.

## 33

ఈనాటి రాజకీయ పార్టీలను గురించి కూడా నాకు కొన్ని నిశ్చితమైన అభిప్రాయాలు ఉంటూ వున్నై.

1) జాతీయోద్యమాన్ని నడిపించి దేశస్వాతంత్ర్యాన్ని సంపాదించిన కాంగ్రెసుకు, తర్వాత కూడా గాంధీజీ నాయకత్వమే కొనసాగివుంటే, దేశానికి ఈనాడు అంటుకొన్నంత అవినీతిపంకిలం అంటి వుండేదికాదు. మొదట్లో సిద్ధాంతపరమైన కొన్ని ఇబ్బందులు ఏర్పడినా, అవి త్వరలోనే సర్దుకుని, దేశం ఆధునిక అభ్యుదయ పథంలోనే ప్రయాణం సాగించేది. అట్టి అదృష్టం నాకు లేకుండాపోయిందనే చింత నాకుంది.

సోషలిస్టు తరహా ప్రభుత్వాన్ని ప్రజాస్వామిక విధానంలో వయోజన వోటింగు ద్వారా నడిపిస్తామని వాగ్దానం చేసిన కాంగ్రెసులో తద్వ్యతిరేకులైన భూస్వామిక వర్గాలు తండోపతండాలుగా చేరారు. తమ ధనబలంతోనూ, మందీ మార్బలంతోనూ రాజకీయాలను ప్రభావితం చేసి, అధికార పీఠాలను కంట్రోలు చేశారు. దానితో ఉద్యమ కాలంలో కాంగ్రెసు పెట్టుకున్న ఆదర్శాలన్నీ తారుమారైపోయాయి. ఏవో కొన్ని ప్రాజెక్టులు తప్ప ఇంతవరకూ ప్రజా సంక్షేమ పరంగా ఎట్టి పురోగమనమూ జరగలేదు.

2) ఇక శ్రామిక వర్గాన్ని, రైతు కూలీలను చైతన్యపరచి, సంఘటిత పరచి జాతికి సర్వతోముఖ అభివృద్ధిని సాధిస్తామని చెప్పిన కమ్యూనిష్టు పార్టీ అసలు భారతీయ సామాజిక ప్రవృత్తినే అర్థం చేసుకోలేకపోయింది. ఈ దేశంలో కులాలున్నాయే తప్ప వర్గాలు లేవని గుర్తించలేకపోయింది. రష్యా గర్జిస్తే తానూ గర్జించడం, చైనా గాండ్రిస్తే తానూ గాండ్రించడం తప్ప సొంత ఆలోచనతో, సొంత ప్రణాళిలతో భారత కమ్యూనిష్టు పార్టీ పనిచేయలేక పోయింది. అందువల్లనే వ్యవసాయ కూలీలు, బలహీన వర్గాలూ ఎక్కువగా కాంగ్రెసునే అనుసరించడం జరిగింది.

3) ఇక భారతీయ జనతాపార్టీ విషయానికొస్తే అదొక విషాదభరిత చరిత్ర. వీళ్ళకు సంప్రదాయమూ తెలియదు, సంస్కారమూ తెలియదు. "కృణ్వంతో విశ్వమార్యం" (ప్రపంచ మానవులందరినీ ఆర్యులుగా మార్చుడు) అంటూ ఋగ్వేదం ఒక ప్రముఖమైన నినాదాన్ని ఇచ్చిందన్న వాస్తవం కూడా వీళ్ళకు తెలియదు. బ్రాహ్మణులంటే బ్రహ్మజ్ఞానులు అనీ, బ్రహ్మజ్ఞానం పుట్టుకతో వచ్చేది కాదనీ, బ్రహ్మజ్ఞానులు అన్ని కులాలతోనూ వుంటారనీ వీళ్ళకు తెలియదు.

అగ్రకులాహంకారంతో రాజకీయాలను నడిపిస్తూ అధిక సంఖ్యాక భారతీయులకు విరుద్ధమైన పిచ్చి పిచ్చి సమస్యలకు ప్రాధాన్యమిస్తూ ఈ పార్టీ ప్రజలకు దూరంగానే వుండిపోతున్నది. ప్రజలలోకి వెళ్ళాలన్న ప్రయత్నాన్ని కూడా ఇంత వరకూ చెయ్యలేకపోతున్నది. ఇతర మతాల ప్రముఖులు తమ మతాల

గొప్పతనాన్ని వేనోళ్ళ చాటుకుంటూ వుంటే, హైందవ మత పీఠాధిపతులు శ్లోకాలను వల్లించుకుంటూ, జాతి మనుగడ స్పృహే లేకుండా నిష్ప్రయోజనంగా కూర్చుండిపోతున్నారు.

4) ఇప్పుడు కొత్తగా రంగంలో దిగిన బహుజనసమాజ్ పార్టీ కూడా యావద్దేశ సమైక్య సంక్షేమాన్ని దృష్టిలో పెట్టు కొన్నట్లు లేదు. కుల ప్రాతిపదికపై నిర్మించబడే ఏ పార్టీ కూడా విజయం సాధించజాలదు.

ఏ రాజకీయ పార్టీకైనా సర్వజన సంక్షేమాన్ని సాధించగలిగిన ఓ సైద్ధాంతిక ప్రణాళిక వుండాలి. ఆ ప్రణాళికను ఆమోదించే ఎవరికైనా సరే, కుల, మత, వర్గ విభేదాలు చూపకుండా తమ పార్టీలో చేర్చుకోవాలి. అప్పుడే అట్టి పార్టీకి పోరాట శక్తి లభిస్తుంది.

దేశంలో ఈనాడు రాజకీయంగా పనిచేస్తున్న ప్రధానమైన జాతీయ పార్టీలు ఈ నాలుగే. ఈ నాలుగు పార్టీల పనితీరు కూడా లోపభూయిష్టంగానే వుంది. ఆయా పార్టీల అధినేతలు స్వార్థ ప్రయోజనాలను అధిగమించి సర్వజన శ్రేయోభిలాషులు కాలేకపోతున్నారు. స్వాతిశయం కోసమే పార్టీలను నడుపుతున్నారు.

## 34

కసరి బుసకొట్టు అతని గాలిసోక
నాల్గు పడగల హైందవ నాగరాజు

అన్నాడు జాషువా గబ్బిలం కావ్యంలో. ఉన్న వాస్తవాన్ని కవిగా తన కవిత్వ ధోరణిలో చెప్పాడాయన. నిజమైన కవిత్వం అంటే ఇది.

ఒక వాస్తవాన్ని సామాన్యుడు వచనంలో చెప్తాడు. అతని మాటను ఎవరైనా పట్టించుకోవచ్చు, ఎవరూ పట్టించుకోకపోవచ్చు. అదే వాస్తవాన్ని కవి కవిత్వంగా చెప్తాడు. కవిత్వంగా చెప్పడమంటే ఆ వాస్తవాన్ని కవి ఒక బాణంలా తీసి ఎదుటివాళ్ళ

గుండెల్లోకి గుచ్చుకునేటట్టు విసురుతాడు. అది గుచ్చుకొన్న వాళ్ళు ఆ వాస్తవాన్ని గుర్తించక తప్పదు. దానిపై చర్య తీసుకోవడమనేది వాళ్ళ వాళ్ళ శక్తి సంస్కారాలపై ఆధారపడి వుంటుంది.

అదే వాస్తవాన్ని విప్లవకారుడైతే ఒక సమస్యగా చేబట్టి, దానిని ఒక రైఫిలుగా మార్చి, కణతకు గురిపెట్టి "సమస్యను పరిష్కరిస్తావా ? ఛస్తావా?" అని గర్జిస్తాడు. రాజకీయ నాయకుడైతే ఆ సమస్యను బజారులో పెట్టి వ్యాపారం సాగిస్తాడు. దానికి రకరకాల రంగులు, రుచులూ పులిమి ప్రజలను దోచుకొని తాను దొరలాగా బ్రతుకుతాడు. నాలుగు రంగాలలోని నాయకులు ఒకే సమస్యను నాలుగు కోణాల నుంచి ఎదుర్కొనే నాలుగు పద్ధతులివి.

హైందవ సమాజంలోని కులవ్యవస్థ మొత్తం సమాజాన్నే నిర్వీర్యం చేసి, విచ్ఛిన్నం చేసి, నాశనం చేసిందన్న వాస్తవం అందరూ గుర్తించినట్టిదే. ఇది పరిష్కారాన్ని ధిక్కరిస్తున్న ఒక విషమ సమస్య. దీనిని నాలుగు పడగల విషసర్పం అన్నాడు జాషువా. వాస్తవాన్ని సూటిగా చెప్పి వదిలేశాడు.

అంబేడ్కరు అలా చెప్పలేదు. ఆయన క్రియాశీలి. ఆ నాలుగు పడగలనూ చితగ్గొట్టమన్నాడు. నరికి పారవేయమన్నాడు. ఇది ఒక జాతి శ్రేయస్సును అభిలషించే రాజకీయ విప్లవకారుడి ధోరణి. ఒక సామాన్యుని యొక్క, ఒక కవి యొక్క, ఒక క్రియాశీలి (Activist) యొక్క ఒక రాజకీయుడి యొక్క ప్రవృత్తి, ప్రవర్తనలో గల తేడాలను వివరించడానికే ఈ ఉదంతం చెప్పాను.

## 35

ఎస్సీలకు (హరిజనులకు, దళితులనబడుతున్నవారికి) అంబేడ్కర్ గారు రాజ్యాంగ చట్టంలో రిజర్వేషన్లు కల్పించారు. దానికి కాంగ్రెస్‌యొక్క యావద్భారత జాతియొక్క పూర్తి ఆమోదం ఉంది. హృదయపూర్వక మద్దతు వుంది.

అయితే ఈ రిజర్వేషన్లు ఎంతవరకు అమలు జరుగుతున్నాయో... అది వేరే విషయం. కనీసం అట్టి రిజర్వేషనుల ద్వారా రాజకీయ పదవులనూ

ప్రభుత్వోద్యోగాలనూ పొందిన హరిజనులు ఎంతవరకు వాటిని తమ దళిత జాతి శ్రేయస్సుకోసం, పురోభివృద్ధి కోసం ఉపయోగిస్తున్నారు ? అనేది ఒక పెద్ద ప్రశ్న. అట్టివాళ్ళు స్వార్థపరులై, జాతి ఔన్నత్యానికి ఏ మాత్రం పాటుపడడం లేదని అంబేద్కర్ గారే తన జీవితం చివరి దశలో కన్నీరు పెట్టుకునేవాడని మనందరికీ తెలుసు. ఆయన సన్నిహితులు వ్రాసిన పుస్తకాలలో ఈ వాస్తవం పరమ దయనీయంగా వర్ణించబడడం జరిగింది.

హరిజన శాసన సభ్యులపైనీ, హరిజన ఉన్నతోద్యోగుల పైనీ నాకు కూడా ఈ ఆరోపణ వుంది. వాళ్ళు హరిజన ప్రజాస్వామ్యం పట్ల కనీస గౌరవ మర్యాదలలను గానీ, సానుభూతిని గానీ చూపడంలేదు. నిజమే

అయితే వాళ్ళు ఎందుకు అలా ప్రవర్తిస్తున్నారు ? ఆలోచిస్తే - వాళ్ళు ఏదైనా ప్రమాదంలో చిక్కుకుంటే ఆదుకొనే ఎవరైనా గాడ్ ఫాదర్ (సమర్థుడైన తమ కులం నాయకుడు) ఉన్నతాధికార స్థానంలో లేకపోవడమే అందుకు కారణమని నే ననుకుంటున్నాను.

ఇతర కులాల అధికారులు తమ కులం జనంతో ఎంత చనువుగా నైనా మెలగవచ్చు. హరిజన అధికారులు మాత్రం తమ కులం జనాన్ని సమీపంలోకి కూడా రానివ్వకూడదు. రానిస్తే గోల చేస్తారు. లేని పోని నేరాలలో ఇరికిస్తారు. పై వాళ్ళకు అంతకంటే పైని రక్షకులుంటారు. కింది వాళ్ళకు వుండరు. ఈ దుస్థితి తొలగడానికి ఇంకా ఎంత కాలం పడుతుందో, అంత కాలం ఈ దురన్యాయాన్ని భరించక తప్పదు కదా !

## 36

నేను ఆంధ్రప్రదేశ్ విధానపరిషత్ సభ్యుడిగా వున్నప్పుడు, ఒకసారి పరిషత్ సమావేశం జరుగుతూ వుండగా, నీటి ఎద్దడి గురించిన చర్చ వచ్చింది.

ఒక ప్రశ్నకు సమాధానం చెపుతూ కాబోలు ఒక మంత్రిగారన్నారు.

"క్రమక్రమంగా రాయలసీమ ఎడారిగా మారవచ్చునన్న అభిప్రాయాన్ని ఎవరో కొందరు నిపుణులు వెలిబుచ్చా" రని.

వెంటనే నేను లేచి "సర్వాధికారాలూ కల ఒక మంత్రిగారే ఆ మాట చెప్పడానికి సిగ్గులేదా ? " అన్నాను. సమావేశంలో కలకలం చెలరేగింది. ఎవరో ఒక సభ్యుడు "Too Much" అని బిగ్గరగా గొణిగాడు. నా విమర్శ టూ మచ్చో, మంత్రిగారి ప్రకటన టూమచ్చో నా కర్థం కాలేదు. అయితే వెంటనే మరొక మంత్రిగారు లేచి (బహుశా సరోజినీ పుల్లారెడ్డిగారు కావచ్చు) అన్నారు. "మామూలు రిగ్గులకు భూగర్భ జలం అందడంలేదు. ఇంకా బలంగల రిగ్గులను విదేశాలనుంచి దిగుమతి చేసుకోడానికి ప్రయత్నిస్తున్నాం" అని.

నే నన్నాను. "ఇప్పటికే భూగర్భ జలమట్టం చాలా తగ్గిపోయింది. రిగ్గులను నమ్ముకొని బత్తాయి తోటలు వేసుకొన్న రైతులు అవి నీరందించక వాడి పోవడంతో బాగా దెబ్బతిని పోయారు. మీరు ఇంకా పెద్ద రిగ్గులు వాడితే మర్రి చెట్ల వంటివి కూడా ఎండిపోయే దుస్థితి దాపరిస్తుంది. అంతకంటే మధ్యధరా సముద్ర తీర దేశాలు చేస్తున్నట్టు సముద్రపు ఉప్పునీటిని యంత్రాలద్వారా చప్పనీరుగా మార్చుకోవచ్చుగా? " అని

"అట్టి యంత్రాలు చాలా ఖరీదు" అన్నారు మంత్రిగారు. "మీ విదేశీ రిగ్గుల ఖరీదు కంటేనా ?" అన్నాను నేను. ఇలా నడిచింది ఆ చర్చ.

"డీసెలైనేషన్' (నిర్లవణీకరణ) యంత్రాలు మన సముద్ర తీరాలలో అక్కడక్కడ పెట్టుకొన్నట్లయితే మొత్తం దేశంలో ఏ ప్రాంతానికీ నీటి కరువు వుండదు. ఈ యంత్రాల ఖర్చును ప్రభుత్వం భరించలేకపోతే ప్రయివేటు రంగంలోని పారిశ్రామిక వేత్తలైనా ఈ ప్రాజెక్టులను చేపట్టవచ్చు కదా ? అనే భావం నాలో గాఢతరం కాజొచ్చింది. నేనెప్పుడూ అదే ధ్యాసలో మునిగి ఉండేవాడిని.

ఆ తరువాత కొద్ది కాలానికే పత్రికలో ఒక వార్త చదివాను. గుజరాత్‌లో ఎవరో ఒక ప్రముఖుడు స్వయం ఉపాధి సాధనంగా ఒక డీసెలైనేషన్ యంత్రాన్ని నెలకొల్పాడని. అంటే – నా మనోగత భావం ఉమ్మడి భావనిధి ద్వారా (విశ్వచైతన్య

శక్తి ద్వారా) తదనుకూల భావశక్తి గల ఒకానొక వ్యక్తిలో కర్మణ్యతను ప్రేరేపించిందన్నమాట.

## 37

నా జీవితంలో ఇలాంటి ఘటనలు చాలానే వున్నై. నేను ఏ పని జరగాలని గాఢంగా అభిలషిస్తూ వుంటానో అట్టి పని ఎక్కడో, ఎవరిద్వారానో జరుగుతూనే వుంటుంది. నేను కోరు కునే చాలా పనులు నేను చెయ్యలేనట్టివే. వాటి కోసం నా ధ్యాన వీచికలు చెయ్యగల సమర్థుల్ని ప్రేరేపిస్తాయన్నమాట.

"పాకిస్తాన్ ఆక్రమణలో ఉన్న కాశ్మీర్ భూభాగాన్ని విడిపించు కోవలసిన పని మాకు ఇంకా మిగిలే ఉన్నది" అంటూ ఈ సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంలో మన ప్రధాని పీ వీ గారు చేసిన ఉద్ఘాటన నన్ను ఎంతో ఆనందపరిచింది. దానికి నా దశాబ్దాల తపోబలం మద్దతు ఉన్నదనిపించింది. ఎందుకంటే, కాశ్మీరుపై విదేశీ దురాక్రమణ జరిగిన సమయంలో నేను ఆంధ్ర ప్రభ సంపాదక వర్గంలో వుండి, ఆ పోరాటానికి సంబంధించిన వార్తాలేఖనాన్ని నిర్వహించాను. అప్పటి నుంచీ కూడా కాశ్మీరు విమోచనం గురించి నేను ధ్యానించని రోజేలేదు.

"దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ ! " అన్న గురజాడ వాక్యం నాకు విరసంగా కనిపిస్తుంది. "వాక్యం రసాత్మకం కావ్యం" అన్న కవితా లక్షణానికి ఈ గురజాడ వాక్యం పూర్తిగా విరుద్ధం.

దేశమంటే మనుషులు కాదు. దేశమంటే మట్టి.

ఒక దేశం నాది అనుకుంటే, ఆ దేశంలో మనుషులున్నా లేకపోయినా, అది గడ్డికూడా మొలవని ఇసుక ఎడారి అయినా, మంచుమల అయినా, అది నాదే, అక్కడి మనుషులు ఒక కాలంలో ఒక మతం వాళ్ళయి వుండవచ్చు. మరొక కాలానికి మరొక మతం వాళ్ళుగా మారిపోవచ్చు. దేశాలు మతాలనుబట్టి మారిపోతూ వుండవు. దేశం జాతికి చెందినట్టిది. ఈ విధమైన నా ఆలోచనలకు ఇప్పుడిప్పుడే బలం చేకూరుతున్నదన్న విశ్వాసం నాలో దృఢతరమవుతూ వస్తున్నది. భావ ఏకాగ్రతా క్రియాశీలతకు నా అనుభవంలో ఇది మరొక నిదర్శనం.

ఈ దేశంలో ముస్లిం, క్రైస్తవ ప్రజా సామాన్యాన్ని చూస్తున్నప్పుడు నా కనిపిస్తుంది... "అయ్యో ! ఈ జనం అంతా పూర్వం నా వాళ్ళే (నా కులం వాళ్ళే)కదా" అని. ముస్లింల పాలనలో ముస్లింలు గానూ, క్రైస్తవుల పాలనలో క్రైస్తవులు గానూ మారిన జనంలో అత్యధిక భాగం క్రింది కులాల వాళ్ళే, అందులోనూ అస్పృశ్యులుగా హిందూ సవర్ణుల చేతుల్లో నరకం అనుభవిస్తున్న నిమ్న కులాల వాళ్ళే.

ఇప్పుడు ఈ దేశంలో మైనారిటీలు అంటే మత మైనారిటీలే. ముఖ్యంగా ముస్లింలే. అందుకే ముస్లింల పట్ల నాకు ఎక్కువ సానుభూతి.

దేశపు మెజారిటీ ప్రజలతో కలవకుండా ఈ జనం ఎంతకాలం ఇలా మైనారిటీలుగా ఉండిపోతారు? అనేది నా ప్రశ్న. మెజారిటీ ప్రజలతో కలవకుండా వీళ్ళను వేరుగా వుంచుతున్నది రాజకీయ పార్టీలే అని నా నమ్మకం. రాజకీయ పార్టీలు వీళ్ళను తమ వోటు బ్యాంకులుగా వాడుకొంటున్నారని లోకమంతటికీ తెలుసు. అందుకే ఈ మైనారిటీలకు నేను తరచు చెపుతూ వస్తున్నాను...

"మిత్రులారా ! జాతిరీత్యా మన మందరం ఒక్కటే, మతాలు, మార్చుకోగలిగినట్టివి. జాతి శాశ్వతమైనట్టిది. మనమంతా మౌలికంగా ఒకే జాతికి చెందినట్టి వాళ్ళం. భారతీయులు, విదేశీయులు మన దేశానికి వచ్చినప్పటి వరకూ మనమంతా ఏదో ఒక కులానికి చెందిన హిందువులమే కదా ! అదీకాక....

"పూర్వంవలె ఇప్పుడు. ఈ ఆధునిక విజ్ఞాన యుగంలో జిహాదులకూ, పవిత్రయుద్ధ ప్రకటనలకూ విలువలేదు. అవి పనిచేయవు. కనుక మతానికి కాక మానవత్వానికి ప్రాధాన్యం ఇవ్వండి. విదేశీ సంప్రదాయాలను తగ్గించు కొని స్వదేశీ ప్రజా జీవన సరళిలో కలిసి నడవండి.

"మతం వేరైనంత మాత్రం చేత మైనారిటీలుగా మగ్గిపోతూ వుండడం ఎంతకాలం ? ఏ ప్రయోజనం కోసం ? వందల సంవత్సరాల క్రితం, ఆనాటి సంకుచిత దేశాల పరిస్థితులకు లోబడి, ఎవరో కొందరు పెద్దలు పెట్టిన నియమ

నిబంధనలు ఈనాటికీ ఆచరణ యోగ్యాలే అని మీరనుకొంటున్నారా ? తోటి మానవులతో కలవకుండా ఎందుకు వ్యర్థమైన ఈ సెగ్రిగేషన్ ?" అంటూ.

ఎప్పటికైనా, ఏ ఒక్కరైనా వినకపోతారా ? నాచే తన జీవిత చరిత్రను వ్రాయించుకొన్న డా॥ ఎమ్.ఎ. ఖాన్ లాంటి మిత్రులు ఉద్భవించకపోతారా? నేను ఆశావాదిని.

అయితే ఇప్పుడు ఇదే ఉద్బోధను దళితులమని చెప్పుకుంటూ, తాము వేరే జాతిగా భావించుకొంటూ, సాంస్కృతికంగా పక్కవారి స్థాయికి ఎదగలేకపోతూ, తమను తాము సెగ్రిగేట్ చేసుకుంటున్న, తద్వారా గిడసబారిపోతున్న నా ప్రజలకు చేస్తున్నాను. కుల వైషమ్యాలూ, మత వైరస్యాలూ వదిలివేయమంటున్నాను. విశాల దృష్టితో, ఉదార హృదయంతో ఏకజాతిగా కలిసిపోయి అందరితో సమానంగా ముందుకు సాగ మంటున్నాను.

## 39

ఏ సామాజిక వ్యవస్థలో అయినా ఆయా వ్యక్తుల గుణస్వభావాలను బట్టి వృత్తుల విభజన ఉంటుంది. చెప్పులు కుట్టేవాళ్ళు, బట్టలు నేసే వాళ్ళు, కుండలు చేసేవాళ్ళు, భూమి దున్నేవాళ్ళు – ఆ విధంగా రకరకాల పనులు చేసేవాళ్ళు అన్ని దేశాలలోనూ, అన్ని జాతులలోనూ వుంటారు. వాళ్ళ మధ్య సాంఘికమైన తరతమ భేదాలేమీ వుండవు.

భారతదేశంలో వేదకాలంలో కూడా హైందవ సమాజంలో అలాంటి భేదాలేమీ లేవు. భూమి దున్నేవాడు రాజ్యం పాలించేవాడుగా ఎదగవచ్చు. చెప్పులు కుట్టేవాడు వేద గురువుగా వికసించవచ్చు. ఈనాడు వున్న కుల వ్యవస్థ ఆనాడు లేదు. కులవ్యవస్థ, వర్ణవ్యవస్థ ఒక్కటి కాదు.

అందుకే నేను పదే పదే చెపుతున్నాను. ఈనాటి జాతి విచ్ఛిన్నకరమైన కుల వ్యవస్థను తొలగించి, ఆనాటి వైదిక వ్యవస్థలోని సోషలిజంవైపు పయనిద్దామని.

## 40

మనది (భారత దేశానిది) అతి పెద్ద ప్రజాస్వామిక మని ప్రచారం చేసుకుంటున్నాం నిజంగా సామాన్య వోటర్లకు మన ఎన్నికలతో సబంధం ఎంత వరకూ ఉంది ? ఈ ప్రశ్నకు జవాబు ఎవరైనా చెప్పగలరు. ఏమీ లేదు అని.

ధనవంతులు వోట్లు కొంటున్నారు. అసలు జనాన్ని వోటింగు కేంద్రాలకే వెళ్ళకుండా నిరోధిస్తున్నారు. దౌర్జన్యంగా వాళ్ళ వాళ్ళ వోట్లను తమ అనుయాయులైన రౌడీలచే గుద్దించేస్తున్నారు. మనది సిసలైన ప్రజాస్వామికం అనడం గోబెల్స్ దొరగారి అబద్ధపు ప్రచారం కంటే కూడా ఘోరమైనదని నిర్లిప్తులైన మేధావులు అంటూ వుండడం కలదు.

బహుశా ఈ అన్యాయం వోటర్లకు ఐడెంటిటి కార్డుల పద్ధతి అమలు జరిగినపుడు సరిదిద్దబడగలదేమో వేచి చూడాలి. ప్రస్తుతం మాత్రం వోట్లు అమ్మకాలూ, కొనుగోళ్ళూ దేశం మొత్తం మీదే ప్రధాన వ్యాపారం అయింది.

ఇక్కడ మరొక ఘోరమైన వాస్తవాన్ని గురించి చెప్పుకోక తప్పదు. ఎన్నికల అభ్యర్థులూ, ఉద్యోగాల అభ్యర్థులూ, కాంట్రాక్టుల అభ్యర్థులూ కూడా చీకటి బజారులో వ్యాపార సరుకు అవుతున్నారు. అభ్యర్థిత్వాలను వేలు, లక్షలు పోసి కొనుక్కొంటున్నారు. ఐదేసి, పదేసి లక్షలు పోసి పార్టీ అభ్యర్థిత్వాన్నో, పదవినో, ఉద్యోగాన్నో కొనుక్కున్నవాడు ఆ తరువాత అవినీతికి పాల్పడితే ఏడ్చి ఏం లాభం ? అవినీతో అని ఏడుస్తున్నాం. దానికి ఆదిలోనే పాలుపోసి పెంచుతున్నాం. ఇదీ మన స్వతంత్ర భారత జాతీయత. నేడు అమలు జరుగుతున్న భారతజాతి ఔన్నత్యం !

## 41

భారత దేశాన్నీ, భారత జాతినీ, భారత సమాజ ప్రగతినీ సక్రమ పద్ధతిలో నడిపించడానికి నేను కొన్ని ప్రణాళికలను ఊహిస్తూవుంటాను. సర్వాధికారాలూ, సర్వశక్తులూ నా చేతికి వస్తే ఈ నా ఊహా ప్రణాళిక లన్నిటినీ అమలు జరపగలననుకొంటూ వుంటాను. అయితే, ఈ ప్రణాళికలలో చాలా భాగం ఇప్పుడు అధికారంలో వున్న ఎవరైనా అమలు చేయగలరు. కాని, అమలు చెయ్యరు, చేసే ఆలోచన కూడా వాళ్ళకి వుండడంలేదు.

(1) ప్రజలందరూ కూడా విద్య, వైద్యం, వృద్ధాప్య సంరక్షణ ఈ మూడూ ఉచితంగా సమకూర్చబడాలి. అందుకయ్యే ఖర్చును పూర్తిగా ప్రభుత్వమే భరించాలి.

(2) వివిధ తరగతుల ఉద్యోగస్థుల, అధికారుల, ప్రజా ప్రతినిధుల మధ్య జీతాలలో ఎక్కువ తేడా లుండకూడదు. ప్రజలపై ఎక్కువ పన్నులు వేయకూడదు. తేనెటీగ పువ్వునుంచి తేనెను గ్రహించేటంత సున్నితంగా రాజు పన్ను వసూలు చేయాలన్న సూత్రం సర్వదా పాటించబడాలి. ఈనాడు ప్రజలను కొల్లగొట్టి ప్రభుత్వ నిర్వాహకులు పంచుకొని తింటున్న దౌర్జన్యస్థితి పూర్తిగా మారాలి. అలా మారినపుడు ప్రజలకు ఉచిత విద్యనూ, ఉచిత వైద్యాన్ని, ఉచిత వృద్ధాప్య రక్షణనూ కలిగించడం ఆర్థికంగా సాధ్య పడుతుంది.

(3) విద్యార్థి సంఘాలకు ఏ దశలోనూ ఎన్నికలు జరగకూడదు. ఉన్నతశ్రేణి విద్యార్థుల నుంచి, సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనే వ్యక్తులను ఆ యా సంఘాలకు నియమించాలి. అట్టి నియామకాలు ఆ యా సంస్థల అధిపతులచే చేయబడాలి. స్వాతంత్ర్యం రాక పూర్వం అదే పద్ధతి వుండేది. విద్యార్థి సంఘాలు రాజకీయాలలో పాల్గొనకూడదు. విద్య పూర్తి అయిన తరువాతనే ఏ రాజకీయాలైనా, ఏ వృత్తి వ్యాపారాలైనా.

(4) ఏ రంగంలోనూ సమ్మెలూ, నిరసన ప్రదర్శనలూ, నిరశన దీక్షలూ, విజ్ఞప్తి ఊరేగింపులూ వంటివి జరగకూడదు. ఆ యా రంగాలలో పనిచేసే వారి అవసరాలను గుర్తించడానికి, సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక పర్యవేక్షక సంఘాలు సదా పనిచేస్తూ వుండాలి.

(5) భారత భూభాగంలోని ఒక్క అంగుళం నేల అయినా పరదేశాల దురాక్రమణలో వుండకూడదు. బలమైన ఏ జాతీ అట్టి దురాక్రమణను సహించదు. ఏ సమస్య పరిష్కారానికైనా సామ దాన భేదాలు పనిచేయకపోతే దండోపాయాన్ని ప్రయోగించాలి. అందుకు సర్వదా సిద్ధంగా ఉండాలి.

(6) భాషా ప్రాతిపదికపై దేశం రాష్ట్రాలుగా ఏర్పాటు చేయబడింది. ప్రతిరాష్ట్రానికి ఒక రాజభాష వుంది. అన్ని రాష్ట్రాలనూ కలిపే దేశభాషగా సర్వరాష్ట్రామోదం పొందిన ఏకైక భాష ఇంగ్లీషు. దానిపట్ల కొందరిచే ఈనాడు ప్రదర్శించబడుతున్న వ్యతిరేకతను పూర్తిగా తొలగించాలి.

(7) గంగా, కావేరీ ప్రాజెక్టును నిర్మించడం ద్వారానూ, సముద్ర తీరాలలో నిర్లవణీకర యంత్రాలను నెలకొల్పడం ద్వారానూ దేశంలో నీటి ఎద్దడిని సంపూర్ణంగా తొలగించాలి.

(8) కులాల, మతాల పేర్లతో విడి విడి పేటలు, బస్తీలు వుండకూడదు. అటువంటి వాటినన్నీ రద్దుచేసి, సమగ్ర సంఘటిత పూర్ణ గ్రామాలను తీర్చిదిద్దాలి.

(9) కుల వ్యవస్థను త్వరితగతిలో రద్దు చెయ్యాలనుకుంటే, కులం మార్పిడి చట్టం చేసి దేశమంతటా అమలు పరచాలి. అప్పుడు ఎవరి దే కులమో అర్థంకాని అయోమయ స్థితి ఏర్పడి, కుల వ్యవస్థ రద్దయిపోతుంది. మతం మార్పిడి అంత సులభంగా కులం మార్పిడికూడా జరగవలసి ఉంది.

(10) కులాలూ, మతాలూ ప్రత్యేక జాతులు కావు. ఒక జాతిలో ఎన్ని కులాలయినా వుండవచ్చు. ఎన్ని మతాలయినా వుండవచ్చు. వాటి మధ్య ఎక్కువ తక్కువ తేడాలు మాత్రమే పనికిరావు. మతాల విషయంలో ప్రస్తుతం ఏ వ్యక్తి అయినా దుస్తులు మార్చినట్టుగా మతాలను మార్చవచ్చు. అందువల్ల మత భేదాలనూ, కుల భేదాలనూ సూచించే గుర్తులన్నిటినీ చట్టపరంగా తొలగించాలి. వ్యక్తిని చూచి అతని కులాన్నో, మతాన్నో చెప్పే వీలుండ కూడదు. ఈనాడు అట్టి వీలును కల్పిస్తున్న చిహ్నాలన్నీ తొలగించ బడాలి.

(11) ఏకాగ్ర క్రియాశీలతను, ఆరాధనను కోరే కళలను సృష్టించే మేధావులకు ప్రభుత్వం తగు ఆర్థిక సహాయం చేస్తూ వుండాలి. **"All art is useless"** అన్నాడు అస్కార్‌వైల్డ్. కళారాధన వల్ల కడుపు నిండడం జరగదు. కడుపునిండే పనులలో సంపూర్ణ కళావిష్కరణ జరగదు. ధన సంపాదన దృష్టికీ, కళాసృష్టికీ పడదు. కనుకనే కవులనూ, కళాకారులనూ పూర్వం రాజులు పోషించేవారు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వాలు పోషించవలసి వుంది.

## 42

ఎన్నికల పద్ధతి మారాలని కూడా నేను అనుకుంటూ ఉంటాను. ప్రస్తుతం వోటర్లను ప్రభావితం చేయడంలోనూ, పోలింగు కేంద్రాలకు తరలించడంలోను

రాజకీయ పార్టీలకే ప్రాధాన్యం వుంటున్నది. ఆ పార్టీలు సదరు అవకాశాన్ని దుర్వినియోగంచేస్తూ భుజబలాన్నీ, ధనబలాన్నీ వోటర్లమీద ప్రయోగిస్తూ ఎన్నికల రంగాన్ని నిరంకుశంగా పరిపాలిస్తున్నై. అందువల్ల రాజకీయ పార్టీల ప్రమేయం ఎన్నికలలో వుండకూడదనేది నా ఉద్దేశం.

ఇందుకు నా ప్రణాళిక ఏమిటంటే – రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ఎంపిక చేసుకొంటారు. తమ అభ్యర్థుల జాబితాను వారి వారి ప్రజా సేవా కార్యక్రమాల వివరాలతో ఎన్నికల కమీషన్‌కు అందజేస్తారు. అంతవరకే రాజకీయ పార్టీల ప్రమేయం.

తనకు అందజేయబడిన అభ్యర్థుల వివరాలను కరపత్రాల ద్వారా ఎన్నికల కమీషనే వోటర్లకు తెలియజేస్తుంది – ఫలితాలను ప్రకటిస్తుంది. ఇలా జరగడంలో అవినీతికి, అక్రమాలకు తావుండదు. వోటర్లు నిర్భయంగా, స్వేచ్ఛగా తమకు నచ్చిన అభ్యర్థులకు వోట్లు ఇవ్వగలుగుతారు. ఈ పద్ధతి ఖచ్చితంగా అమలు జరగాలనేది నా కోరిక.

## 43

1994 సెప్టెంబరు 19వ తేదీతో నాకు ఎనభయి మూడు సంవత్సరాలు పూర్తి అయి ఎనభయి నాలుగవ సంవత్సరం ప్రవేశిస్తున్న సంగతి తెలుసుకుని, "సహస్ర పూర్ణ చంద్ర దర్శనోత్సవం " చేస్తామని వచ్చిన మిత్రులు చాలామందే వున్నారు. ఆంధ్ర యూనివర్సిటీ తెలుగుశాఖ అధ్యక్షులైన ఆచార్య ఆపదరావు గారు అందులో ఒకరు. అట్టి ఉత్సవాన్ని విశాఖ సముద్రతీరంలో చేస్తామన్నారు.

జొన్నకూటి నాగేశ్వరరావుగారు, వేదయ్యగారు గుంటూరులో చేస్తా మన్నారు. ఈ అందరికీ సమాధానంగా సరే సరే అంటూ వచ్చాను. అయితే, డాక్టర్ జస్టిస్ కొత్తపల్లి పున్నయ్యగారు అడిగినప్పుడు మాత్రం నా సహస్ర పూర్ణిమోత్సవం నిజంగానే జరిగే టట్టున్నదని ఉత్సాహపడ్డాను. ఎందుకంటే, జస్టిస్ పున్నయ్యగారి కార్యనిర్వహణ దక్షత అట్టిది. ఆయన నిజంగా ఒక పని చెయ్యాలని సంకల్పించుకొన్నాడంటే, ఏమైనా సరే అది జరిగి తీరవలసిందే.

మానవుని జీవితంలో షష్టిపూర్తి ఒక ప్రధానమైన మజిలీ, అరవై ఏళ్ళు నిండినప్పుడు చేస్తారది. తరువాతి ఘట్టం సహస్ర పూర్ణచంద్ర దర్శనోత్సవం.

చాంద్రమానం ప్రకారం ఒక్కొక్క నెలకు ఒక్కొక్క పూర్ణిమ చొప్పున, మూడేళ్ళ కొకసారి వచ్చే అధిక మాసాలను కూడ కలుపుకుని, ఎనభై రెండు సంవత్సరాలు నిండినప్పటికి వెయ్యి పూర్ణిమల దర్శనం పూర్తి అవుతుంది.

నాకు గత సంవత్సరం సెప్టెంబరు 19 తోనే వెయ్యి పూర్ణిమల దర్శనం పూర్తి అయింది. అయితే, ఇట్టి ఉత్సవం ఒకటున్నదనీ, దానిని వైభవోపేతంగా జరుపుకోవచ్చుననీ నా సన్నిహితులకూ, నా మిత్రులకూ అర్థం కావడానికి, కార్యాచరణకు ఒక సంవత్సరం పట్టిందన్నమాట.

(సౌరమానం ప్రకారం నాకు 1995, జనవరి 19 నాటికి సహస్ర మాసాలు కూడా నిండుతై)

ఏది ఏమైనప్పటికీ నన్ను అభిమానించే వారిలో, ముఖ్యంగా సాంస్కృతికంగా వెనుకబడి వున్న హరిజన విద్యావంతులలో చైతన్య వికాసం క్రమంగా వృద్ధి పొందుతూ వున్నందుకు నాకెంతో ఆనందం కలిగింది.

సమైక్య జాతిపిత అంబేద్కరు గారు ఆశించిన వికాస క్రమం ఇదే. నేను నా చిన్నప్పటి నుంచీ చేస్తూ వస్తున్న ఉద్బోధకు లక్ష్యమూ ఇదే.

## 44

నే నిప్పుడు ఈ విశిష్ట గౌరవ సన్మాన సముత్సాహ శిఖరాగ్రంపై నిలబడి, ఒక్కసారి నేను సాగివచ్చిన జీవిత మార్గం వైపు వెనక్కి తిరిగి చూచుకుంటున్నాను, సింహావలోకనం చేసుకుంటున్నాను.

జీవిత పురోగమనంలోని ముఖ్య ఘట్టాలను మాత్రం ఇక్కడ బయోడేటాగా పేర్కొంటాను. పూర్తి వివరాలతో ఆత్మకథను చెప్పుకోవడం ఇక్కడ సాధ్యపడదు. అయినా నా కథను నేనే చెప్పుకోవడం నా కిష్టం ఉండదు. నేను అబద్ధాలు చెప్పలేను.

నా జీవిత చరిత్రను ఇతరులు వ్రాస్తే వ్రాయవచ్చు. అప్పుడు అందుకు నేను బాధ్యత వహించవలసి వుండదు.

ఆంగికం భువనం యస్య
వాచికం సర్వ వాఙ్మయం
ఆహార్యం చంద్ర తారాది
తం వందే సాత్వికం శివం.

నిరాకార పరమాత్మను సాకారం చేసుకొని నేను దర్శించిన విశ్వ చైతన్య రూపం ఇది. దీనినే నేను శివ సరస్వతీ రసాద్వైత శక్తిగా సదా జపిస్తూ వస్తున్నాను.

ఇంతవరకు నా జీవితం పొడుగునా నాకు కలుగుతూ వచ్చిన, నన్ను చింతనకు గురి చేస్తూ వచ్చిన కొన్ని భావాలనూ, ఆలోచనలనూ, ఊహలనూ చెప్పాను, ఇంకా ఎన్నో వున్నై. వాటి సంగతి తర్వాత !.

## నా జీవిత ఘట్టాలు (బయోడేటా)

1911 : తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురులో 1911 సెప్టెంబరు 19వ తేదీన మంగళవారం నాడు రాత్రి 8-9 గం॥ల మధ్య ఒక పేద హరిజన కుటుంబంలో జననం. తండ్రి బోయి పల్లయ్య (పల్లయ్యదాసు అని పిల్చే వాళ్ళు అందరూ) తల్లి నాగమ్మ.

1922 : మొదటి వ్రాత కవిత. తండ్రిగారి వేదాంతమూ, కోన సీమ సౌందర్యమూ కలిసిన ప్రణవ ప్రణయ సహజ రస ధార అది.

1929 - 31 : రాజోలు హైస్కూలులో విద్యాభ్యాసం. చిల్లరిగె యోగానందయ్య, గార్లంక వీర వెంకట సత్యనారాయణ, తిమ్మరాజు శేషగిరిరావు, కోట పాలయ్య గార్ల కఠిన శిక్షణ, క్రమశిక్షణ, ప్రేమ వాత్సల్యాలు, "ప్రణయ లహరి" పద్య కావ్యం రచన (అది ముద్రించబడలేదు).

1931-35 : కాకినాడ పి.ఆర్. కాలేజీలో ఇంటరు రెండేళ్ళు, బి.ఎ. రెండేళ్ళు, గోరా గారి స్నేహం, కృష్ణశాస్త్రి గారి పరిచయం బ్రహ్మ సమాజంతో పేచీ, నాస్తికుడిగా ముద్ర, కాంగ్రెసు ఉద్యమంతో గ్రామాల వెంట ప్రచారం, ఆది ఆంధ్ర (మాల, మాదిగ) పేటలలో కార్యక్రమాలు.

1936 : మద్రాసు తెలుగు దినపత్రిక 'జనవాణి' కి ఉప సంపాదకత్వం - ఎడిటరు తాపీ ధర్మారావు గారి ప్రోత్సాహం - చలం, శ్రీ వాత్సవ, నార్ల, పండితారాధ్యుల వంటి ప్రముఖుల సాహచర్యం, జానపదుని జాబులు (పల్లెటూరి లేఖలు) జనవాణిలో ధారా వాహిక.

1937 : రాజమండ్రిలో బి.ఇడి. చదువు, డాక్టర్ కుసుమ ధర్మన్నగారి 'జయభేరి' పత్రికకు వాస్తవ సంపాద కత్వం. పిపాసి కథలు. సాహిత్యరంగంలో సంచ లనం. క్రొవ్విడి లింగరాజు అభిమానం.

1938 : మద్రాసులో 'ప్రజామిత్ర' పత్రికకు ఉప సంపాద కత్వం, ఆంద్ర

శేషగిరిరావు గారి ఔదార్యం. జాన పదుని జాబులు కొనసాగింపు.

1939 : మద్రాసులో బి.ఎస్. మూర్తిగారి 'నవజీవన' పత్రికకు రూపకల్పనా, వాస్తవ సంపాదకత్వమూ, స్మాల్ పాక్స్ (Small Pox) తో ఒక రెండు నెలలపాటు తొండయార్ పేట అంటు వ్యాధుల ఆస్పత్రిలో చికిత్స.

1940 - 45 : (1) తూర్పుగోదావరి ముమ్మిడివరంలో ఉపాధ్యాయుడిగా నియామకం. "మాలలు రాజులౌదురు సుమా!" అనే పద్యాలూ, అకాండ తాండవం రచనా. దీపసభ కావ్య రచన ప్రారంభం, అస్పృశ్యతా సమస్యలూ, మోరిలో 'పాలేరు' ప్రథమ ప్రదర్శన.

(2) రామచంద్రపురం, రాజమండ్రి, రాజోలు హైస్కూళ్ళ లో తాత్కాలికోపాధ్యాయత్వం, ఈలివాడపల్లిగారి వాల్మీకి ఆశ్రమం, ఆంధ్ర యూనివర్సిటీ సెనేటు సభ్యత్వం. కాంగ్రెసు ఉద్యమాన్ని- నాయకులు జైళ్ళలో ఉన్నప్పుడు బ్రతికించి వుంచడం. ఆగష్టు విప్లవ ప్రచారం. అండర్ గ్రౌండు వర్కు.

(3) అంబేడ్కరు గారి ఆంధ్రదేశ యాత్రలో పాల్గొనడం. ఆయనపై ఇంగ్లీషులో పద్యాలు.

1946 : (1) రాజోలు హైస్కూలు హెడ్ మాస్టారు కోట పాలయ్య గారి సలహాపై ఉపాధ్యాయ పదవి నుంచి కాంగ్రెసు పక్షాన ఎన్నికల ప్రచారంలో ప్రవేశం. రాష్ట్ర కాంగ్రెస్ (హరిజన వింగ్) ఆర్గనైజరుగా వివిధ జిల్లాలలో పర్యటన.

(2) సంయుక్త కార్యదర్శిత్వం, హరిజన సేవక్ సంఘ్, మద్రాసు.

(3) పిఠాపురంలో మహారాజా వారి షష్టిపూర్తి సందర్భంలో సన్మానం.

(4) ఆంధ్రప్రభ పత్రికలో ప్రవేశం – నార్ల వారి ప్రోత్సాహంతో.

(5) మంత్రి కూర్మయ్యగారిచే వ్యవసాయ కూలీ పత్రికను స్థాపింప చేయడం, ఆ పత్రికకు ఆధిపత్యం. మద్రాసు ప్రభుత్వంలో అసిస్టెంటు పబ్లిసిటీ ఆఫీసరు పదవి, పాలేరు నాటకంపై అభియోగం, ప్రభుత్వంచే దర్యాప్తు, నాటకానికి అనుకూలంగా తీర్పు.

(6) మద్రాసు సెక్రటేరియట్ సాంస్కృతిక సంఘం వారిచే కూలిరాజు నాటక ప్రదర్శన, జస్టిస్ రాజమన్నార్ గారి అభినందన, కూలిరాజు ప్రథమ ముద్రణ.

1950 – 55 : (1) మద్రాసు తెలుగు దిన పత్రిక ఆంధ్రప్రభకు ఉప సంపాదకత్వం.

(2) అనేక గ్రంథాలకు సమీక్షలు, ఆయా గ్రంథ రచయితలతో వివాదాలు.

(3) ఏక పద్యోపాఖ్యానం రచన, తిరుమల రామచంద్ర, విద్వాన్ విశ్వం, నీలంరాజు వేంకట శేషయ్య మున్నగు వారితో మైత్రి.

(4) 1952లో కాంగ్రెసు అభ్యర్థిగా రాజోలు ద్విసభ్య నియోజక వర్గం నుంచి ఉమ్మడి మద్రాసు శాసన సభకు పోటీ, కమ్యూనిష్టుల చేతిలో ఓటమి. (ఆ ఎన్నికలలో మొత్తం కోస్తా అంతా కాంగ్రెసు ఓడింది.)

(5) 1953లో మంత్రి సంజీవయ్యగారి అధ్యక్షత క్రింద మంగళగిరి పరవస్తు దాసుగారి నిర్వహణతో గుంటూరు జిల్లా చెరుకుపల్లిలో ప్రజా సన్మానం. పగటి దివిటీలు, బ్రహ్మరథం, గండ పెండేర బహూకరణ.

(6) 1955లో ఆంధ్ర ప్రభుత్వ ట్రాన్స్‌లేషన్ డిపార్టు మెంటు అధిపతిగా, పుస్తకాల రిజిస్ట్రారుగా పబ్లిక్ సర్వీస్ కమీషన్ వారిచే నియామకం - ఓపెన్ కాంపిటీషన్‌లో.

1956 : ఆంధ్రప్రదేశ్ అవతరణ - ఆంధ్రా తెలంగాణా సర్వీసుల కలయిక - ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌లేషన్ డిపార్టుమెంటుకు డైరెక్టరుగా నియామకం, దీపసభ ముద్రణ, హైదరాబాదుకు మార్పు.

1957 - 60 : (1) నవ్యసాహితీ సమితి అధ్యక్షత - సాహిత్య అకాడమీ సభ్యత్వం - సంగీత నాటక అకాడమీ సభ్యత్వం. స్పీకరు కాళేశ్వరరావుగారి అధ్యక్షత కింద సాంకేతిక పద కోశ (గ్లాసరీ) నిర్మాణంలో ప్రధాన పాత్ర. అఖిల భారత తెలుగు రచయితల ప్రథమ మహాసభల నిర్వహణ

(2) సుఖేలా నికేతన్ స్థాపన, పైరుపాట ముద్రణ, ప్రదర్శన, సత్తెనపల్లిలో సాధువమ్మగారి ప్రమేయంతో వీరయార్య సాహితీ సంస్థవారిచే సన్మానం, స్వర్ణాంగు ళీయ బహూకరణ. ఆంధ్ర నలంద అధిపతి డాక్టర్ అడుసుమిల్లి నారాయణరావు గారి పరిచయం.

(3) గుడివాడలో ఆంధ్ర నలంద వారి సన్మానం. రజత ఫలక స్వర్ణాక్షర పద్య పురస్కారం.

(4) నెల్లూరులో ఆంధ్ర హరిజన సేవక సంఘ ఉత్సవాలు, సన్మానం, హరిజనుల పుట్టు పూర్వోత్తరాలపై ఉపన్యాసం.

(5) "హరిజనులు ఆర్యులే !" అన్న ఆ ఉపన్యాసమే పీఠికగా, సాక పేములు ఐ.ఎ.ఎస్. గారి ప్రోత్సాహంతో 'రాగవాశిష్ఠం' (అరుంధతీ కళ్యాణం) నాటకం ప్రథమ ముద్రణ. ( ఆ తరువాత అది డా।। నిడదవోలు వెంకటరావు, ఆచార్య ఖండవల్లి

లక్ష్మీరంజనం, ఆచార్య దివాకర్ల వెంకటావధాని గార్ల ప్రయత్నంతో ఉస్మానియా డిగ్రీ క్లాసులకు పాఠ్యగ్రంథం అయింది.)

(6) కల్లూరి సుబ్బారావుగారికి అంకితంగా "భీమన్న కావ్య కుసుమాలు" పద్య కావ్యసంపుటి ముద్రణ. నీలం సంజీవ రెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, విశ్వనాథ, దేవులపల్లి వంటి పెద్దలతో గొప్ప అంకితోత్సవ సభ.

1962 : గురజాడ సెంటినరీ కమిటి కార్యదర్శిత్వం (ముఖ్య మంత్రి అధ్యక్షుడు)

1964 : రాగవైశాఖి రచన, బాపురెడ్డి గారి ప్రోత్సాహంతో ముద్రణ - పత్రికలలోను, శాసనమండలిలోనూ దుమారం, ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డిగారి సమర్థన.

1964 : ఆదిభట్ల నారాయణదాసు సెంటినరీ కమిటి కార్యదర్శిత్వం.

1965 : నెల్లూరులో కవిత్రయం వారి జయంతి సభలలో తిక్కవరపు రామిరెడ్డిగారి సన్మానం.

1966 : ఉద్యోగ విరమణ

1968 : (1) కాకినాడలో "మహాకవి" బిరుదుతో ప్రజాసన్మానం.

(2) అమలాపురంలో బి.వి. రమణయ్య ఎమ్.ఎల్.ఎ. గారి ఆధ్వర్యంలో సన్మానం.

1971 : (1) ఆంధ్ర యూనివర్సిటీచే "కళాప్రపూర్ణ" గౌరవ డాక్టరేటు ప్రదానం.

(2) తూర్పు గోదావరి జిల్లా కలెక్టరు ఎల్. మాల కొండయ్య గారి సాహితీ సముత్సాహ ప్రమేయంతో జిల్లాలో సన్మాన పరంపర.

(3) స్వగ్రామం మామిడికుదురులో డా॥ సి.నా.రె. అధ్యక్షతలో షష్టిపూర్తి మహోత్సవం, 'సాహిత్య వసంత' బిరుదు ప్రదానం. రాగవాశిష్టం నాటక ప్రదర్శనం.

1973 : (1) శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో రజత సరస్వతి బహూకరణ, ఎల్. మాలకొండయ్య. జె. బాపురెడ్డి, బొజ్జా కృష్ణశాస్త్రి గార్ల సమక్షంలో.

(2) భారత ప్రభుత్వంచే "పద్మశ్రీ" ప్రదానం, పద్మశ్రీని అయ్య మల్లయ్యకు అంకితం చేస్తూ హరిద్వార్ దీపోత్సవంలో గంగలో వదలడం. హృషీకేష్ యాత్ర.

1974 : బెంగుళూరు కన్నడ పరిషత్తు వారిచే చందన సరస్వతి బహూకరణ. ఎమ్.ఎన్. భూషి గారితో కలిసి కర్ణాటక హరిజన నాయకుడు బసవ లింగప్పగారితో గోష్ఠి, ప్రసిద్ధ జర్నలిష్టు వి. టి. రాజశేఖర శెట్టి గారి పరిచయం, ఆతిథ్యం.

1975 : కేంద్ర సాహిత్య అకాడమీ (ఢిల్లీ) వారిచే "గుడిసెలు కాలిపోతున్నై" కవితా సంపుటికి నేషనల్ అవార్డు.

1976 : (1) కాశీ విద్యాపీఠ్ (వారణాసి) వారిచే డి. లిట్. గౌరవ డాక్టరేటు ప్రదానం గవర్నరు డా॥ మర్రి చెన్నారెడ్డిగారి ఆతిథ్యం.

(2) లక్ష్మీ రఘురామయ్యగారి అధ్యక్షతలో ఢిల్లీలో ఆంధ్ర సంఘాల సన్మానం.

(3) 1975 – 76 సం॥లలో వరుసగా రెండు సార్లు ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ అవార్డ్సు కమిటీల సభ్యత్వాలు

(4) ప్రపంచ తెలుగు మహాసభలలో సన్మానం.

(5) న్యూఢిల్లీలో రిపబ్లిక్ దినోత్సవ జాతీయ కవి సమ్మేళనంలో తెలుగుకు ప్రాతినిధ్యం.

1978 : (1) రాష్ట్ర విధాన పరిషత్‌కు గవర్నరు గారిచే నామినేషను (1978 –84)

(2) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే అంతర్జాతీయ తెలుగు సంస్థ గవర్నింగ్ బాడీకి నియామకం.

1981 : (1) మలేషియాలో రెండవ ప్రపంచ తెలుగు మహాసభ లలో సన్మానం. సతీసమేతంగా పెనాంగ్, సింగపూర్ మహానగరాల సందర్శన, విందులు, రోప్‌వే వినోదాలు.

(2)ముఖ్యమంత్రి అంజయ్యగారిచే 'ఆస్థానకవి'గా నియామకం. (అమలు జరగలేదు)

(3) అంబేద్కరు కల్చరల్ అకాడమీ స్థాపన ప్రతిపాదనకు ముఖ్యమంత్రి అంజయ్యగారి ఆమోదం – (అమలు జరగలేదు)

(4) వివిధ లెజిస్లేచర్ కమిటీలలో సభ్యుడిగా రాష్ట్రం లోని పలు ప్రాంతాలలోనూ, ఢిల్లీ, ఆగ్రా, కాశ్మీర్, మధుర వంటి సుందర చారిత్రక ప్రదేశాలలోనూ సకుటుంబంగా పర్యటన.

1983 : (1) "భీమన్న సాహిత్యానికి షష్టిపూర్తి" సందర్భంగా సన్మానం – దేవులపల్లి రామానుజరావు, గనుమల జ్ఞానేశ్వర్‌గార్లు అధ్యక్ష, కార్యదర్శులుగా ఏర్పాటైన ప్రముఖుల సంఘంచే.

(2) సిండికేట్ సభ్యత్వం – శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ, అనంతపూర్, వైస్ ఛాన్సలర్ ఆచార్య ఏబెల్, ప్రో॥ కొలకలూరి ఇనాక్, ఇంజనీరు చింతా శ్రీరామ మూర్తి, మునప్పగార్ల స్నేహ సౌహార్ద్రాలు.

1985 : (1) అంబేద్కరిజం గ్రంథావిష్కరణ, అంకితోత్సవం – రవీంద్రభారతిలో – అంకితం జస్టిస్ పున్నయ్యగారికి, ముఖ్య

అతిథి గవర్నరు డా॥ శంకర్‌దయాళ్ శర్మగారు, ప్రతిభా భారతి వంటి చాలమంది మంత్రులూ, ఆఫీసర్లూ పాల్గొన్న సభ అది.

(2) అఖిల భారత దళిత రచయితల మహాసభల ఆహ్వాన సంఘాధ్యక్షత, బొజ్జాతారకం ప్రధాన కార్యదర్శిగా.

1988 : విజయవాడలో "కనకాభిషేకం" - డా॥ పోలవరపు సుబ్బారావుగారి ఆధ్వర్యంలో.

1989 : (1) హైదరాబాదులో సెప్టెంబరు 19న 'పుష్పాభిషేకం'.

(2) విజయవాడలో 'పాలేరు' అంకితోత్సవం - నాటక ప్రదర్శన, కోనాడ అశోక్‌గారి అధ్వర్యంలో.

1990 : విశాఖపట్నంలో 80వ జన్మదినోత్సవ సందర్భంలో 'కనక పుష్పాభిషేకం' - ఆచార్య ఆపదరావుగారి ఆధ్వర్యంలో, జిల్లా కలెక్టర్ దయాచారి గారి ఆతిథ్యం.

1991 : (1) నెల్లూరులో తిక్కవరపు రామిరెడ్డి సెంటినరీ అవార్డు బహూకరణ - బెజవాడ గోపాలరెడ్డి గారిచే.

(2) గుంటూరులో దళిత ఓపెన్ యూనివర్సిటీ అఫ్ ఇండియా వారి డాక్టరేటు, రంజన్‌బాబు గారిచే.

(3) అంబేడ్కరు సెంటినరీ ఉత్సవాల రాష్ట్రకమిటీ సభ్యత్వం - సన్మానాలు.

(4) రాజాలక్ష్మి సాహిత్య పురస్కారం. పి.వి. రమణయ్య రాజా గారిచే.

1992 : (1) తెలుగు యూనివర్సిటీ వారి ప్రథమ విశిష్ట పురస్కారం (వైస్ ఛాన్సలర్ డా॥ సి. నారాయణరెడ్డి)

(2) శ్రీకాకుళం జిల్లా రచయితల మహాసభలకు అధ్యక్షత. (ప్రధాన కార్యదర్శి రామిశెట్టి)

(3) కాకినాడలో జిల్లా దళిత కవిసమ్మేళనం అధ్యక్షత. (ఎ. రామేశ్వరరావు గారి అంబేద్కరు చైతన్యవేదిక ఆధ్వర్యంలో.) అప్పటి నా ఉపన్యాసమే అంబేద్కరు మతం గ్రంథంగా వెలువడింది.

(4) 82 వ జన్మదినోత్సవం రవీంద్ర భారతిలో – మంత్రులు పి. రామచంద్రారెడ్డి, పాటి రాజం గార్లు, ఆచార్య సినారె, జస్టిస్ కె. పున్నయ్యగార్లు, బొజ్జా తారకం, కె. మాధవరావు, ఐ.ఎ.ఎస్, బి. దానం ఐ.ఎ.ఎస్, టి. గోపాలరావు ఐ.ఎ.ఎస్ గార్లు – దాకే శివాజీ ధర్మజ్యోతి సంస్థ ఆధ్వర్యంలో– 'పాటలలో అంబేద్కరు' గ్రంథావిష్కరణ, పర్సు బహూకరణ.

1993 : (1) 83వ జన్మదినోత్సవం, సారస్వత పరిషత్తు హాలులో, అంబేద్కర మతం ఈశ్వరీబాయి గారికి అంకితం, మంత్రులు గీతారెడ్డి, చంద్రశేఖర్‌గార్లు, ఆచార్య సినారె, మల్లెమాల, జస్టిస్ పున్నయ్య, వాసిరెడ్డి సీతాదేవి మున్నగువారు.

(2) గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీచే గౌరవ డాక్టరేటు ప్రదానం. (వైస్ ఛాన్సలర్ ఆచార్య వై. సింహాద్రి.)

1994 : సహస్ర పూర్ణ చంద్ర దర్శనోత్సవం. డా॥ జస్టిస్ పున్నయ్య గారి అధ్వర్యంలో, ప్రధానంగా హరిజన ఉన్నతోద్యోగుల సహకారంతో.

* * *